
మృతి చెందిన పాప (ఫైల్)

## మూడేళ్ల చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

తార్నాక, నవంబర్ 18 ప్రభాతవార్త: స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ చిన్నారి బస్సు చక్రాల కింద మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన మేడ్చల్ జిల్లా జవహార్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్ ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. భవిష్య అనే (3)ఏళ్ల చిన్నారి శనివారం తన అన్న స్థానికంగా ఉండే రచన గ్రామర్ స్కూల్‌కు వెళ్తుండగా సెండ్ ఆఫ్ ఇచ్చేందుకు వెళ్లింది. అంతలోనే బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును డ్రైవ్ చేయడంతో ఆమె బస్సు కింద పడింది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు హుటాహుటిన పాపను ఆసుపత్రికి తరలించారు. కానీ పాప అప్పటికే మరణించిందని వైద్యులు ధృవీకరించారు. చిన్నారి మృతితో తల్లి, తండ్రుల రోదనలు మిన్నంటాయి. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బస్సు డ్రైవర్ ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# హైదరాబాద్ వార్త

# ముషీరాబాద్‌లో బిఆర్ఎస్ బేజారు

**ప్రధాన పార్టీల జోరు ● అభ్యర్థి వైఖరితో గులాబీ శ్రేణుల్లో గుబులు ● పుత్రరత్నం దూకుడుతో కేడర్‌లో నిరసనలు**



**చూసీనా చూడనట్లుగా ఎమ్మెల్యే, తనయుడు.. గుర్తుపట్టనట్లుగా ఓవర్ యాక్షన్**

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తోపాటు ఆయన తనయుడు గతంలో మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా కార్యకర్తలు వీరి వద్దకు వస్తే చూసినా చూడనట్లుగా వ్యవహరించడం పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ విషయంలో రగిలిపోతున్న కార్యకర్తలు ప్రచారానికి దూరంగా ఉంటూ ఎన్నికల్లో తగిన బుద్ధిచెబుతామని హెచ్చరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని, తండ్రి కొడుకుల వైఖరిలో మార్పు రాకపోతే వచ్చే ఎన్నికల్లో కారుకు నష్టం తప్పదని పలువురు హెచ్చరిస్తున్నారు. వీరికి వద్దకు వస్తే పలకరించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతంత మాత్రంగా ప్రచారం నిర్వహించడమే కాకుండా తన వద్దకు వచ్చిన వారిని ఎమ్మెల్యే పట్టించుకోకుండా వుండడం వల్ల ఏ విధంగా మద్దతు పలుకుతామని పలువురు కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

హైదరాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజవకర్గంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొడుకు పెత్తనం ఎక్కువ కావడంతో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి ఓ వైపు మరో వైపు కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్ ప్రచారంలో దూసుకుపోతుండడంతో కారుని కలవరానికి గురిచేస్తున్నాయి. ఎమ్మెల్యేను పక్కన పెట్టి తనయుడు దూకుడు వ్యవహారంతో నాయకులతోపాటు ప్రజల్లో నిరసన వ్యక్తం అవుతోందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుమారుడి వైఖరితో ఎమ్మెల్యే నామమాత్రపు ఎమ్మెల్యేగా మిగిలిపోయారని స్థానిక నేతలు విచారం వ్యక్తం చేస్తున్నారు. రబ్బర్ స్టాంప్‌గా మారిన ఎమ్మెల్యే మాటను నాయకులతో పాటు ప్రజలు నమ్మడంలేదని విమర్శలు ఉన్నాయి. తనయుడి పెత్తనం ఎక్కువ కావడంతో ఆయన తీరుతో గులాబీ జెండాను పక్కన పెడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. నియోజకవర్గంలో అన్ని వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్న ఎమ్మెల్యే తన తనయుడిని అదుపు చేయలేకపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.. పర్యావసానంగా విసిగి వేసారిన పార్టీ సీనియర్ నాయకులు, పార్టీకోసం అహర్నిషలు కృషిచేస్తున్న కార్యకర్తలు క్రమంగా పార్టీని వీడుతూ ప్రధాన పార్టీల తీర్థం పుచ్చుకోవడంతో పార్టీకి ఎన్నికలో తీరని నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయి. అయినా ఎమ్మెల్యే ముఠా గోపాల్ తనయుడిని గాడిలో పెట్టకుండా కళ్ళు తెరవని తీరుతో ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ కోటకు బీటలు వారుతున్నాయి. దీంతో సీనియర్లతోపాటు ఎన్నో ఏళ్ళుగా పార్టీకి వెన్ను దన్ను గా నిలిచిన కార్యకర్తలు, నాయకుల్ని పట్టించుకోకపోవడం పట్ల పలువురు వీరి ఇద్దరి తీరును తప్పు పడుతున్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరూ పార్టీ నుంచి ఇతర పార్టీల్లో చేరుతుండడం పార్టీకి ఆందోళన కలిగిస్తోంది.

**కొడుకుని కంట్రోల్‌లో పెట్టని ఎమ్మెల్యే..** ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం వల్లే ఆయన తనయుడి పెత్తనం ఎక్కువైందని, లేనిపోని పెత్తనం చెలాయించడం పార్టీ సీనియర్ల సలహాలు, సూచనల్ని పట్టించుకోకపోవడంతోపాటు వారిని దుర్భాషలాడడం వల్ల వారు మనో వేదనకు గురై పార్టీ ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు అంజన్‌కుమార్ యాదవ్‌తో పాటు బిజెపి అభ్యర్థి పూస రాజుల అభ్యర్థుల కంటే బిఆర్‌స్ అభ్యర్థి ముఠాగోపాల్‌ని పార్టీ ముందుగానే ప్రకటించినప్పటికీ కార్యకర్తలు సహకరించకపోవడం, సమన్వయం లోపంతో బిఆర్ ఎస్ ప్రచారంలో వెనుకబడగా అంజన్‌కుమార్ యాదవ్ ముందం జలో ఉన్నారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేసి ప్రచార వ్యూహాలను పదును పెట్టగా బిఆర్ఎస్ చతికిలబడింది. రాష్ట్రం మొత్తం మీద బిఆర్ఎస్ కాంగ్రెస్‌కి గట్టి పోటీఇస్తూ అధికారమే లక్ష్యంగా ప్రచారాన్ని హోరెత్తిస్తుండగా ఎమ్మెల్యే గోపాల్ కొడుకు తీరుతో కారుకి కష్టాలు తెచ్చాయి. ఎమ్మెల్యేతోపాటు ఆయన తనయుడి వైఖరిలో మార్పు రాకపోతే వచ్చే ఎన్నికలల్లో కారు మునిగిపోయే నావలా తయారై ఎన్నికల్లో భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

**దూసుకుపోతున్న కాంగ్రెస్.. ఢీలా పడ్డ బిఆర్ఎస్**

బిఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌ని గెలిపిస్తే ముషీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి చేయకుండా తన ఆస్తులను పెంచుకోవడానికే పరిమితమై ప్రజా సమస్యలను గాలికి వదిలేశాడని ఆయనే లక్ష్యంగా కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్ ప్రచార అస్త్రాలను సందిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలువాలని ప్రచారంలో ఆ పార్టీ దూసుకుపోతుంది. పార్టీ సీనియర్ నాయకులు , ముఖ్యనేతలతో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలతోపాటు ఇతర ఎన్నికల వాగ్ధానాలు తప్పకుండా కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందని ఓటర్లకు వివరిస్తున్నారు. అసలు బిఆర్ఎస్ ఎమ్మెల్యేకి సమస్యలు పట్టవని, ఈ ఐదేళ్ళలో అభివృద్ధి చేయని ఎమ్మెల్యే తిరిగి రెండవ సారి గెలిపించాలని కోరుతున్న గోపాల్ మోసపూరిత వాగ్దానాలను చూసి మోసపోవద్దని ప్రజల్ని కోరుతున్నారు. అధికార బిఆర్ఎస్ ఇస్తున్న హామీల కన్నా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీను ప్రజలు ఎక్కువ విశ్వసిస్తున్నారు. ఎమ్మెల్యే గోపాల్ చెప్పిన మాటలను ఎవరూ నమ్మడంలేదు. అధికారంలో ఉన్నప్పుడు అమలు చేయనప్పుడు, తిరిగి గెలిపిస్తే చేసా_నని చెబితే ప్రజలు ఎమ్మెల్యే ముఠా గోపాల్ చెబుతున్న మాటల్ని నమ్మడంలేదు.

# సమయం సరిపోవట్లే..



**నేతలు, కార్యకర్తలతో అభ్యర్థులు**
**రోజంతా ఉరుకులు, పరుగులు**
**బస్తీలు, కాలనీల్లో విస్తతమైన ప్రచారాలు**
**పోలింగ్ దక్కరపడుతుండటంతో**
**అభ్యర్థుల్లో ఆందోళన**

హైదరాబాద్, నవంబర్ 18,ప్రభాతవార్త: ప్రచారంలో అటుతిరిగి ఇటుతిరిగి వచ్చేలోగా రోజు గడిచిపోతుంది. ఏరోజు అనుకున్న పనులు ఆరోజు అయితలేవు. సమయం సరిపోవడం లేదు. పోలింగ్ రోజేమో దగ్గరపడుతుంది. రోజుకు 28గంటలు ఉంటే బాగుండు "ఇటీవల ఓనాయకుడు తన అనుచరుల వద్ద చేసిన వాఖ్యలు". ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారంలో భాగంగా క్షేత్రస్థాయిలో ఓటర్లందరినీ చేరుకునేందుకు అధిక సమయం కావాలనుకుంటున్నారు. కానీ ప్రస్తుతం పోలింగ్‌కు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో విస్త్రతంగా ప్రచారం చేస్తూనే మిగిలిన ఈకొద్దిరోజులు ప్రణాళిక బద్ధంగా వినియోగించుకోవాలని భావిస్తున్నారు. ప్రధాన పార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థులు తమదైనందిన జీవితాన్నిమార్చుకుంటున్నారు. తెల్లవారుజామునే నిద్రలేని ప్రచారానికి సిద్ధమవుతున్నారు. తిరిగి అర్ధరాత్రి వరకు ఎన్నికలను ఎదుర్కొనాలి అనేఅంశంపై ప్రణాళికలు,వాటి అమలులో నిమగ్నమవుతున్నారు.

**సహాయకుల పరిస్థితి అంతే..** అన్ని పనులు చక్కబెట్టుకోవడం అభ్యర్థుల రోజువారీ బిజీ షెడ్యూల్‌లో క్లిష్టమే..ఈకీలక సమయంలో ఏదీ మరిచిపోయినా ..అది చివరికి ఫలితాలపై ప్రభావం చూపిస్తుంది. అయితే ప్రతిక్షణం, ప్రతి విషయం అభ్యర్థులకు అత్యంత ముఖ్యమైనవే, అందుకే ఈసమయంలో వారి వ్యక్తిగత సహాయకుల పాత్ర కీలకమవుతుంది. నిర్దేశించుకున్న పనులు నిర్ణీత సమయానికి గుర్తుచేయడం, అందిరినీ సమన్వయం చేయడం వంటి బాధ్యతలు వీరి నిర్వర్తిస్తారు. అలా అభ్యర్థులకు సహాకారం అందిస్తున్న వారు సైతం సమాయాభావ సమస్య ఎదుర్కొంటున్నారు.

**అభ్యర్థుల దినచర్య..** నగర వ్యాప్తంగా ప్రధాన పార్టీల అభ్యర్థుల దినచర్య పరిశీలించగా దాదాపు అందరూ ఒకేరకమైన జీవనశైలి అనుసరిస్తున్నారని తెలుస్తుంది. ప్రజలకు చేరువ కావడానికి కొందరు నాయకులు సాయంత్రం దాటిన పర్యటనలు,ప్రచారంలోనే ఉంటూ ఇంటింటికి వెళ్ళి మద్దతు కోసం అభ్యర్థిస్తున్నారు. ఉదయం 6గంటలకల్లా ప్రచారంలోకి దిగుతున్నారు. ఈరోజు ఎవరెక్కడ ప్రచారం చేస్తున్నారు. వారంతా క్షేత్రస్థాయికి చేరుకుంటున్నారా ? లేదా ? అని ఆరా తీయడం, అవసరమైతే పార్టీ బూత్, డివిజన్ స్థాయి ఇంచార్జ్‌లతో మాట్లాడుతున్నారు. ఉదయం 7గంటల వరకు కాలకృత్యాలు తీర్చుకుని అల్పాహారం తీసుకుని సిద్ధమవుతున్నారు. ఉదయం 8-9గంటల మధ్య ముఖ్యులతో మంతనాలు చేస్తున్నారు. ఆరోజుకు సంబంధించిన పనులు నిర్దేశించి 9గంటల ముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ప్రచారానికి బయల్దేరి వెళ్తున్నారు. మధ్యాహ్నం 1-2 మధ్య భోజన విరామం తీసుకుని అనంతరం గంటపాటు అనుచరులతో భేటీ అవుతున్నారు. అనంతరం 2గంటల తర్వాత ఎన్నికల ప్రచారం మొదలుపెడుతున్నారు. ఆతర్వాత రాత్రి 9గంటల వరకు ప్రచారం ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్నారు. అనంతరం ముఖ్య నాయకులు, అనుచరులతో రహస్య మంతనాలు. వ్యూహాలపై చర్చలు ఇది సందర్భాన్ని బట్టి అర్ధరాత్రి 12 - ఒంటిగంట వరకు సాగుతుంది. ప్రధానంగా అసంతృప్తులను బుజ్జగించడం, పార్టీలోకి ఆహ్వానించాల్సిన కొత్త వారి గురించి చర్చలు జరుపుతున్నారు. తిరిగి మరుసటి రోజు షెడ్యూల్ నిర్ధారించుకోవడం వంటివి చేస్తున్నారు. మధ్యలోకాస్త సమయం తీసుకుని రాత్రి భోజనం చేస్తున్నారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే అభివృద్ధి సాధ్యమైంది

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్, నవంబర్ 18 ప్రభాతవార్తః రాష్ట్రం, భాషా ఏదైనా ఇక్కడ స్థిరపడిన వారంతా తెలంగాన బిడ్డలేనని సనత్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మోండామార్కెట్‌లోని పాట్ మార్కెట్‌లో పాట్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివాలీ సమ్మెళన్ కార్యాక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తుందని చెప్పారు. 50 సంవత్సరాలలో జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి జరిగిందని వివరించారు. హైద్రాబాద్ నగంరం కూడా ఎంతో అభివృద్ధి చెంది దేశంలోని ప్రముఖ నగరాలలో ఒకటిగా నిలించిందని చెప్పారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రోడ్ల అభివృద్ధి, నూతన ఫ్లై ఓవర్‌లు, అండర్ పాస్‌ల నిర్మాణం చేపట్టడం జరిగిందని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల విద్యుత్ సరఫరా జరుగుతుందని, ఎలాంటి ఆటంకాలు లేకుండా పరిశ్రమలు పని చేస్తున్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు ఓట్లువేసి మరింత అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యాక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, పాట్ మార్కెట్ జ్యూవెల్లరీ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ సర్మాల్ జైన్, రాష్ట్ర పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పారస్‌మల్ రాక, జైన్ సేవా సంఘ్ అధ్యక్షుడు యోగేష్ సింఘీ, అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు మనీష్ అగర్వాల్, ఏపీ మహేష్ బ్యాంక్ చైర్మన్‌రమేష్ కుమార్ అగర్వాల్, గోల్డ్ బులియన్ ఫెడరేషన్ అధ్యక్షుడు జగదీష్ ప్రసాద్ వర్మ, ఆత్తమ్ సింగ్ రాజ్ పురోహిత్, గులాబ్ సింగ్ రాజ్ పురోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## మహాదేవ్ మందిరంలో అన్నకూట్ ప్రసాదం



చార్మినార్, నవంబరు 18 ప్రభాతవార్త : కార్తీక మాసం సందర్భంగా పాత బస్తీ ఘాన్సీ బజార్‌లోని పలు ప్రాంతాలలో అన్నకూట్ ప్రసాద్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కార్తీక మాసం ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం అవ్వటంతో ఘాన్సీ బజార్‌లో మందిరాల కమిటీలు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. కాగా చార్‌కమాన్ జెవెల్లర్స్ అండ్ షరాఫా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరంలో అన్నకూట్ ప్రసాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మందిరం చైర్మన్ అజయ్ కుమార్ అగర్వాల్ తెలిపారు.సోమవారం మందిరంలో పరమ శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాత్రి 7.15 గంటలకు అన్న కూట్ ప్రసాదం ప్రారంభం అవుతుందని ఆయన తెలియజేశారు.భక్తులు కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించాలని ఆయన కోరారు.

### సనత్‌నగర్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి : మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సంజీవరెడ్డి నగర్..** తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత సనత్‌నగర్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించామని సతన్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం రాత్రి అమీర్‌పేట్ డివిజన్ శ్రీరాం నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకంటే ముదు ఇక్కడ గెలిచి ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా ఉండి కూడా అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. తాను వచ్చిన తరువాత ముఖ్యమంత్రి కెసిఆర్, మున్సిపల్ శాఖమంత్రి కెటిఆర్‌ల సహాకారంతో గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు.

# అన్నా మమ్మల్ని చూసుకో..

➢ పనులు వదిలేసి మీకోసం ప్రచారం చేస్తున్నాం
➢ ఆర్థికంగా సర్దుబాటు చేయాలని కార్యకర్తల విన్నపాలు
➢ పార్టీలో చేరేవారికి డబ్బులిస్తున్నారు.. మా పరిస్థితి ఏంటి..?
➢ కొత్తకొత్త డిమాండ్లతో తలలు పట్టుకుంటున్న అభ్యర్థులు

హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త: ఎన్నికల ప్రచారంలోకి పూర్తిస్థాయిలో దిగేందుకు సిద్దమవుతున్న అభ్యర్థులకు కిందిస్థాయి నేతల డిమాండ్లు విని తల పట్టుకుంటున్నారు. రోజువారీ ఖర్చులు, ఉదయం, సాయంత్రం అన్నీ చూసుకుంటామని హామీ ఇస్తున్నా .."ఇంకాస్త" కావాలంటూ మనసులో మాట చెబుతు న్నారు. చిన్నపాటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని కొంత సర్దుబాటు చేయాలని కొందరు అడిగితే.. అప్పులతో సమమతమవుతున్నామని ఆదుకోవాలని ఇంకొందరు కోరుతున్నారు. ఇటీవల నగరంలోని ఓనియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీ అభ్యర్థితో ఓబస్తీ నాయకుడు తనకు రూ.3లక్షల అప్పు ఉందని.. కాస్త "సర్దుబాటు"చేస్తే మీరే ఏపార్టీ మారినా మీవెంటే ఉంటానంటూ కోరాడు. ఒక్కరికే ఈస్థాయిలో ముట్టజెబితే నియోజకవర్గంతా ఎంత ఖర్చు చేయాల్సి వస్తుందోనని సదరు అభ్యర్థి సన్నిహి తుల వద్ద వాపోయాడు.

**ప్రచారానికి వస్తే మా పనులేలా..** అభ్యర్థులకు ఎన్నికల ప్రచారంలో కాలనీలు, బస్తీల్లో ప్రతి ఒక్కర్నీ పేర్లతో పరిచయం చేసే ముఖ్య కార్యకర్తలు ఎంతో ముఖ్యం. ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలతో అభ్యర్థులకు పెద్దగా ఇబ్బంది లేకపోయినా కార్యకర్తలు, బూత్‌స్థాయి నేతలతో ఇబ్బంది వచ్చిపడుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు కిందిస్థాయి నేతల్ని మచ్చిక చేసుకుంటున్నారు. వీరిలో ఎక్కువగా చిరువ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే కావడంతో పనులన్నీ మానుకొని ప్రచారానికి వస్తే ఇబ్బంది అవుతుందని తెగేసి చెబుతున్నారు. దీంతో అభ్యర్థులు అప్పటికప్పుడు ఎంతో కొంత ముట్ట జెప్పిసర్దు బాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.



అభ్యర్థులకు

**తలనొప్పిగా బుజ్జగింపులు..** కింది స్థాయిలో నేతల్ని బుజ్జగించడం అభ్యర్థులకు తల నొప్పిగా మారింది. ఎన్నికలకు ముందు పార్టీ మారిన వారు ఇరకాటంలో పడుతున్నారు. నిన్నకాక మొన్న వచ్చిన వాళ్లకు డబ్బులిచ్చి పార్టీలో చేర్చుకుంటున్నారు. మీకోసమే అన్ని వదిలేసి పనిచేస్తున్నాం..మముల్ని పట్టించుకోకుంటే ఎట్లా అని ప్రశ్నిస్తున్నారు. పార్టీ మారగానే అప్పటిదాకా తమ వెన్నంటే ఉన్నవారు ప్రత్యర్థులు అవుతుండగా .. ఇన్నాళ్లు ప్రత్యర్థులుగా ఉన్నవారు వెంట ఉన్నారు. "కళ్ల ముందు ఎమ్మెల్యే కుర్చీ "కదలాడుతుంటే ఇన్నాళ్ల కొనసాగిన వైరాన్ని మర్చిపోవాలంటూ అప్యాయంగా మాట్లాడుతూ ఎంతోకొంత ముట్టజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.


వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవాలు

హైదరాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త: ఫ్యూచరిస్టిక్ విద్యాసంస్థల అనుబంధ శాఖ దిక్రీక్‌ప్లానెట్ స్కూల్ వీనస్ క్యాంపస్‌లో శనివారం సంగం 2023 పేరుతో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు సుజాత నాయుడు, గౌరవ అతిథి మానసిక శాస్త్ర నిపుణులు సుధీర్‌సంద్రతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు "కాస్మిక్ లాంబిగస్ "అనే నేపథ్యం ఆధారంగా తీసుకుని ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందిరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎఫ్ఈఐ వైస్ చైర్మన్ పాండురంగాచారి, డైరెక్టర్ నరేంద్రప్రసాద్, ఆకడమిక్ హెడ్ జయశ్రీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 21నుంచి లెజెండ్స్ లీగ్ క్రికెట్

హైదరాబాద్, నవంబర్ 18,ప్రభాతవార్త: ఈనెల 21 నుంచి లెజెండ్స్ లీగ్ క్రికెట్ (ఎల్ఎల్‌సి)టోర్నమెంట్ జరగనుంది. ఈమేరకు శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ఎల్ఎల్‌సి జెర్సీని సినీనటుడు విక్టరీ వెంకటేష్ ఆవిష్కరించారు. " అర్బర్‌రైజర్స్ హైదరాబాద్ "జట్టుకు సురేష్ రైనా నేతృత్వం వహించనున్నారు. మాజీ క్రికెటర్ నిఖిల్ చోప్రా కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఈజట్టులో మార్టిన్ గప్టిల్, ద్వేన్‌స్మిత్, పీటర్ ట్రెగో, చమర కపుగెదెర, స్టువర్ట్ బిన్నీలతోసహా ప్రజ్ఞాన్‌ఓజా ,తిరుమలశెట్టి సుమన్, సుదీప్ త్యాగితోపాటు నగరానికి చెందిన వారు కూడా లైనప్‌లో ఉన్నారు. ఈసందర్భంగా విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ నిఖిల్ కోచ్‌గా,రైనా జట్టు కెప్టెన్‌గా, సుమన్, ప్రజ్ఞాన్‌లతో జట్టు పటిష్టంగా ఉందన్నారు. అర్బర్‌రైజ్ చైర్మన్ మనోజ్ నంబూరు మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి సొంత క్రికెట్‌జట్టు అందించడం గర్వంగా ఉందన్నారు. జెర్సీలోని రంగులు శక్తి,గెలవాలనే అభిరుచిని సూచిస్తాయన్నారు.

# పొలిటికల్ హీట్

## ప్రచారానికి అగ్రనేతలు



హైదరాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త : ఓటింగ్ సమీపిస్తున్న తరుణంలో అన్ని పార్టీల అగ్రనేతలు దృష్టి రాజధానిపై పడింది. ముఖ్యంగా పెద్ద పార్టీల అగ్రనేతలు ఢిల్లీ నుంచి అక్కడికి వస్తున్నారు. బిఆర్ఎస్ అగ్రనేతలు, మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు, టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లు ఇప్పటికే రాజధానిలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ఈనెల 21 నుంచి నాలుగైదు సభల్లో పాల్గొంటారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ రెండు సమావేశాలకు ప్రియాంక గాంధీ కూడా హాజరుకానున్నారు. శుక్రవారం కాంగ్రెస్ మేనిఫెస్టోను ఆపార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విడుద చేశారు. బిజెపి మేనిఫెస్టోను కేంద్ర మంత్రి అమిత్‌సా శనివారం విడుదల చేశారు. ప్రధాని మోదీతో మరో బహిరంగ సభకు పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. ఈ నెల 25న పట్టణ పరిధిలో జరిగే భారీ సభలో సిఎం కెసిఆర్ పాల్గొనున్నారు.

**25న సిఎం కెసిఆర్ సభ..** బిఆర్ఎస్ ఎఇన్నకల ప్రచారం ఊపందుకుంది. సిఎం కెసిఆరక్ష్ రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేస్తున్నారు. మూడు నుంచి నాలుగు అసెంబ్లీ నియోజవకవర్గాల్లో ప్రతిరోజూ జన అశీర్వాద సభలు నిర్వహిస్తున్నారు. తొమ్మిదిన్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు బిఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఇందులోభాగంగా ఈనెల 25న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగసభ నిర్వహించనున్నారు. జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఈ సమావేశానికి రానున్నారు. ఇందులో సిఎం కెసిఆర్ పాల్గొంటారు. ఈ సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ నేతలు సన్నాహాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా పరేడ్ గ్రౌండ్‌లో సమావేశం నిర్వహించేందుకు రక్షణ శాఖ అనుమతి ఇచ్చింది. దీంతో సభా ఏర్పాట్లు వేగవంతం కానున్నాయి.

**21వ తేదీ తర్వాత రాహుల్ ప్రచారం..** ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ అగ్రనేతలంతా వచ్చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు రాహుల్, ప్రియాంక సహా పలువురి నేతలు ప్రచారం నిర్వహించారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రచారం ఊపందుకుంటోంది. నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచార గడువు ఈ నెల 21తో ముగియనున్నాయి. దీని తర్వాత రాహుల్ గాంధీ తెలంగాణలో ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కూడా విస్తృతంగా పర్యటించనున్నారు. ప్రతి నియోజకవర్గంలో వీఐపీ పర్యటనలు ఉండేలా కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది.

**నగరంలో అమిత్ షా..** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నగరానికి వచ్చారు. శనివారం ఉదయం 10 గంటలకు నగరంలో అడుగు పెట్టారు. బేగంపేట విమానాశ్రయం నుంచి నేరుగా గద్వాల, నల్గొండ, వరంగల్‌లో జరిగే విజయ సంకల్ప సభల్లో పాల్గొని నగరానికి వచ్చారు. అక్కడ బిజెపి "సకల జనుల సౌభాగ్య తెలంగాణ" మేనిఫెస్టోను విడుదల చేశారు. అనంతరం సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితితో పాటు అన్ని అనుబంధ విభాగాలతో నిర్వహించే జాతీయ సమావేశంలో పాల్గొన్నారు.ప్రధాని మోదీతో మరో బహిరంగ సభకు పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి అధిత్యనాధ్ కూడా ఎన్నికల ప్రచారానికి రానున్నట్లు పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గంలో బిఆర్ఎస్ ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న మాధవరం కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 18, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బోయిన్‌పల్లి డివిజన్‌లో శనివారం వేలాదిమంది కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో కూకట్‌పల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు, కార్పోరేటర్ ముద్దం నరసింహాయాదవ్‌తో కలిసి బోయిన్‌పల్లి డివిజన్‌లోని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ బ్రహ్మ రథం పట్టారు. ప్రతి కాలనీలో ర్యాలీ నిర్వహించి బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అవతరించిన తరువాత పదేళ్ళ కాలంలో చారిత్రాత్మకమైన పనులు చేసి చూపించామన్నారు. దశాబ్దాలుగా బోయిన్‌పల్లిలోని హస్మత్‌పేట చెరువు వద్ద ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని కానీ ఇక్కడ కల్వర్టు నిర్మించి చెరువును సుందరీకరించి బతుకమ్మ కుంటలు వంటివి ఏర్పాటు చేసి చూపించా మన్నారు. పూర్తిస్థాయిలో పనులు త్వరలోనే పూర్తవుతా యని అంతేకాకుండా గల్లీ గల్లీకి సీసీ రోడ్డు, ఇంటింటికి మంచినీరు నిరంతర విద్యుత్‌తో పాటు శాంతి భద్రతలకు ఎక్కడా విఘాతం కలగకుండా చేశామన్నారు. ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసే ముఖ్యమంత్రి మన కెసిఆర్ అని అందుకనే రాబోయే రోజుల్లో మళ్ళీ కారు గుర్తుకు ఓటు వేసి తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## బిఆర్ఎస్‌కు మరోసారి అవకాశం ఇస్తే మహిళలు పుస్తెలు అమ్ముకోవాల్సిందే

**కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్**


ప్రచారంలో అభివాదం చేస్తున్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 18, ప్రభాతవార్త : బిఆర్ఎస్‌కు మరోసారి అవకాశం ఇస్తే మహిళలు పుస్తెలు అమ్ముకోవలసిందేనని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్, తులసి నగర్, లక్ష్మీ నగర్, బోరబండ వివిధ కాలనీలలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి బండి రమేస్‌తో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ సత్యంశ్రీరంగం, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తూము వేణు, విఠల్‌రెడ్డి పలువురు నాయకులు ప్రచారం చేశారు. వివిధ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ కుటుంబాలు అధికార పార్టీ నియంతపాలనా విధానం ఇంకా ఎన్నాళ్ళు భరించాలి ఇక మేము భరించలేము, మేము సైతం అంటూ కాంగ్రెస్ బాటలో మాకు ఈ గేటెడ్ కమ్యూ నిటీల సమస్యలు తీర్చడానికి కాంగ్రెస్ పార్టీనే న్యాయం చేస్తుందని పేర్కొన్నట్లు చెప్పారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి బండి రమేష్ అడుగులో అడుగువేసి విజయం మనదే అని సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథ కాలతో పాటు ఇతర అంశాలు మేనిఫెస్టో చాలా అద్భుతంగా ఉన్నాయని, స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహా, మహిళా అధ్యక్షురాలు భారతమ్మ, యూత్ ప్రెసిడెంట్ పుల్లపు వేణు కనకయ్య, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో ప్రచారంలో దూసుకుపోతున్న ప్రకాశ్‌గౌడ్

**అడుగడుగునా బ్రహ్మారథం పడుతున్న ప్రజానికం ■ హారతులిచ్చి ఆహ్వానిస్తున్న మహిళలు**


రాజేంద్రనగర్ నియోజకవర్గంలో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, నవంబర్ 18 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రచారంలో దూసుకు పోతున్నారు. తన ప్రత్యర్థులకు అందనంత వేగంగా ప్రచారంలో ముందుంటున్నాడు. ఇప్పటికే ఓ మారు నియోజకవర్గంలోని శంషా బాద్, రాజేంద్రనగర్, గండిపేట్ మూడు మండలాలను చుట్టి వచ్చాడు. ఇంటింటి ప్రచారంతో పాటు, భారీ రోడ్‌షోలు సైతం నిర్వహించి నిత్యం ప్రజల నోళ్లలో నానుతున్నాడు. శంషాబాద్‌లో మండల అధ్యక్షులు చంద్రారెడ్డి, సీనియర్ నేత గణేష్ గుప్త, మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మా మహేందర్‌రెడ్డిలు, బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, అధ్యక్షులు సురేష్‌గౌడ్‌లు, నార్సింగిలో సీనియర్ నేతలు మల్లేష్ ముదిరాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సిహ్మా, చైర్ పర్సన్ రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, కార్పోరేటర్లు, కౌన్సిలర్లు ప్రకాశ్‌గౌడ్ ప్రచారాన్ని గ్రామ గ్రామాన హోరెత్తిస్తున్నారు. శనివారం శంషాబాద్‌లోని పెద్ద గోల్కొండ, చిన్న గోల్కొండ, సంఘీగూడ, హామీదుల్లానగర్ ప్రాంతాలలో భారీ రోడ్‌షోను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ 15.ఏళ్లుగా రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి రేయింబవళ్లూ కష్టపడ్డానని, మరోమారు గెలిపిస్తే అభివృద్ధిని పూర్తి చేస్తానన్నారు. పని చేసే వారికి అధికారంను అప్పగిస్తేనే ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధిని వేగంగా చేయడం సాధ్యపడుతుందన్నారు. మూడోసారి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత బహదూర్‌గూడ రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇప్పిస్తానని హామీనిచ్చారు. దేశంలోనే రైతులకు అండగా ఉంటూ అగ్రపీఠం వేసిన ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్‌దేనని తెలిపారు. ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మీ, కేసీఆర్ కిట్లు, రైతు బంధు, రైతు భీమా వంటి పతకాలు ఇంటింటికి చేరాయని, అవే మా గెలుపుకు ఉపకరిస్తాయని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు.

## వృత్తుల జీవితా ప్రతిభింభం 'పరంపర': జూలూరి గౌరీశంకర్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్

హైదరాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త: శిరంశెట్టి కాంతారావు లోతైన పరిశోధకులు అని తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ అన్నారు. శనివారం రాత్రి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ సాహిత్య అకాడమి నవలల పోటీలో బహుమతి పొందిన నవల 'శిరంశెట్టి కాంతారావు రచన' 'పరంపర' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్.రఘు అధ్యక్షతన జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ తెలంగాణ సాహిత్య అకాడమి నిర్వహించిన నవలల పోటీలలో విజేతగా నిలిచిన నవల పరంపర అని అన్నారు. ఈ పరంపర నవలలో జీవితాలను, మరుగు భాషలను వెలుగులోకి తెచ్చారన్నారు. వృత్తి జీవితాల ప్రతిబింబం పరంపర అని అన్నారు. ప్రొఫెసర్ ఎస్.రఘు మాట్లాడుతూ కాంతారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు. పరిశోధనాత్మక కథలు, నవలలు రాశారన్నారు. ప్రముఖ విమర్శకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పరంపర ఒక బహుజన స్వరం అని అన్నారు. ఈ నవలను పరిచయం చేశారు. ధృవ ఫౌండేషన్ సభ్యులు దండె లక్ష్మణ్, దుండు మల్లేశం మాట్లాడారు. ఈ సభలో ప్రముఖ కవులు నాళేశ్వరం శంకరం, తంగిరాల చక్రవర్తి, అనంతోజు మోహనకృష్ణ, ఎ.అప్పలనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్విమ్మింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన నిపునిత




కంటోన్మెంట్, నవంబర్ 18 ప్రభాతవార్త: ఆర్టీసి కంటోన్మెంట్ డిపోలో పనిచేస్తున్న ఏడిసి పబ్బ శ్రీనివాస్ కుమార్తె నిపునిత 67వ ఎస్.జి.ఎఫ్. రాష్ట్ర స్థాయి టోర్నమెంట్స్ 2023-24 స్విమ్మింగ్ టోర్నమెంట్స్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నెల 16 నుంచి 18 తేదీల్లో సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించిన రంగారెడ్డి స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ స్విమ్మింగ్‌పుల్ టోర్నమెంట్స్‌లో విజయం సాధించినందుకు ఆర్టీసి ఉద్యోగులు నిపునితను అభినందించారు.

## ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పోరేటర్ ఆగంరాజు ముదిరాజ్


బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరుతున్న కార్పోరేటర్

నిజాంపేట్, నవంబర్ 18, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సందర్భంగా శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎన్ఎంసి 17వ వార్డు కౌసల్యనగర్ కాలనీలో కార్పోరేటర్ ఆగంరాజు ముదిరాజ్ ఎస్ఎస్‌కె ప్లాటీనం, ఏబిసి బ్లాక్స్, డిఎస్ఆర్ హర్షిత్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్స్‌లో ప్రతి ఫ్లాట్‌కు వెళ్ళి, ప్రతి ఓటర్‌ను కలిసి బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న వివేకానంద గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గన్నారు.

### పాట మానసిక ఉల్లాసాన్ని కల్పిస్తుంది

చిక్కడపల్లి, నవంబరు 18 ప్రభాతవార్త: పాట మానసిక ఉల్లాసాన్ని కల్పిస్తుందని సుప్రసిద్ద నేపథ్య గాయనీ, నంది అవార్డుగ్రహీత సురేఖ మూర్తి అన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ సర్వీసెస్ అధినేత టి.రామోజీ ఆధ్వర్యంలో తెలుగు-హిందీ సినీసంగీత విభావరి కార్యక్రమం జరిగింది.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మినీ సైన్స్ ఫెయిర్ ఏర్పాటు

కొంపల్లి, నవంబర్ 18, ప్రభాతవార్త : దూలపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లల చేతుల మీదుగా శనివారం మినీ సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు కావలసిన పరికరాలను అందించి పిల్లల చేత దగ్గరుండి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. దీనిని సందర్శించడానికి గ్రామంలోని కౌన్సిలర్, విద్యార్థుల తల్లిదండ్రులు విచ్చేశారు. పిల్లలు ఉత్సాహంగా పాల్గొని వారు తయారు చేసిన మోడల్ గురించి సవివరంగా ఇంగ్లీష్‌లో, తెలుగు భాషల్లో వివరించారు. ఈ కార్యక్రమాన్ని సందర్శించిన కౌన్సిలర్లు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అగస్త్య ఇంటర్నేషనల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యకు ఆదరణ పెరుగుతుంది

**ఏకెఎస్ యూనివర్సిటీ తెలంగాణ ఇంఛార్జ్ సాంబశివయాదవ్**



కోర్సుల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సాంబశివయాదవ్, ఉషారాణి

హైదరాబాద్, నవంబర్ 18,ప్రభాతవార్త: రోజురోజుకు వ్యవసాయ విద్యకు ఆదరణ పెరుగుతుందని ఏకెస్ యూనివర్సిటీ తెలంగాణ ఇంచార్జ్ సాంబశివ యాదవ్ అన్నారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో విద్యాలయాలు, కళా శాలలు అగ్రిల్చర్ బిఎస్సీ కోర్సుని నిర్వ హిస్తున్నాని వీటిలో ఐసిఎఆర్ గుర్తింపు ఉన్న విశ్వవిద్యాలయంలో చాలా తక్కువ సీట్లు ఉండగా ఎక్కువ పీజులు ఉన్నాయన్నారు. ఆగుర్తింపు ఉండికూడా ఎకెఎస్ యూనివర్సిటీలో డొనేషన్ లేకుండా అత్యంత తక్కువ ఫీజుతో కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. ఈవిశ్వ విద్యాలయంలో 20లాబొరేటరీస్, వంద ఎకరాల్లో వ్యవసాయ భూమి, ఎంతోమంది ఫిహెచ్‌డి ప్రొఫెసర్లతో కలిగి ఉందన్నారు. ఈయూనివర్సిటీ విద్యార్థులకు ఏడాదికి 20లక్షల జీతంతో కూడిన ప్యాకేజీతోపాటు భారతదేశంలోనే బెస్ట్ ప్రైవేట్ యూనివర్సిటీ ఔట్‌లుక్ సర్వే అవార్డు ,సోల్ ఆఫ్ ఇండియా అవార్డు ఇన్ హౌజ్‌ఆఫ్ లార్డ్ బ్రిటీష్ పార్లమెంట్‌లో అరుదైన గౌరవం లభించిందన్నారు. ఈకార్యక్రమంలో ఆయనతోపాటు ఉషారాణి, గణేశ్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో మరోసారి గులాబీ జెండా రెపరెపలాడడం ఖాయం

**బిఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ**

**బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి నియోజకవర్గంలో విస్తృత ప్రచారం**


ఖాజాగూడలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బిఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ

సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 18 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో మరోసారి గులాభి జెండా రెపరెపలాడడం ఖాయమని శేరిలింగంపల్లి బిఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్, అస్బెస్టాస్ కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ప్రచారం నిర్వహించారు. హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో స్థానిక బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి అరెకపూడి గాంధి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో బిఆర్ఎస్ నాయకుడు బాలింగ్ గౌతంగౌడ్ ఆధ్వర్యంలో ఇతర పార్టీల కార్యకర్తలు బిఆర్ఎస్‌లో చేరగా, అరెకపూడి గాంధీ కండువాలతో వారిని ఆహ్వానించారు. మియాపూర్ డివిజన్ పరిధిలో నిర్వహించిన క్రిస్టియన్ మైనారిటీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసీవనం వాసులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి గాంధీ పాల్గొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్‌కు చెందిన యాదగౌడ్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరగా, బిఆర్ఎస్ కండువాతో అరెకపూడి గాంధీ ఆహ్వానించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడలో శనివారం సాయంత్రం మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్, ఐటి శాఖమంత్రి కెటిఆర్‌ల సహకారంతో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లానని అన్నారు. ముఖ్యంగా నియోజకవర్గం అభివృద్ధి కోసం 9వేల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకలు గణేష్ ముదిరాజ్, రాజునాయక్, చెన్నంరాజు, రాగం జంగయ్యయాదవ్, రాజు ముదిరాజ్, దారుగుపల్లి నరేష్, నవాజ్, మల్లేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నోరి రాఘురామమూర్తి నాటికల సంపుటి ఆవిష్కరణ

చిక్కడపల్లి, నవంబరు 18 ప్రభాతవార్త: నోరి రఘురామ మూర్తి రచించిన 'పురుషుల దినోత్సవం-డోంట్ వర్రీ బీ హ్యాపీ' రెండు నాటికల సంపుటి ఆవిష్కరణ సభ శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికలో కళ్యాణి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది.

## ముంబై వలస జీవుల డిమాండ్లు అమలు చేస్తామనే పార్టీకి మద్దతు

**రాష్ట్రంలో 15 లక్షల మంది ఓటర్లు ఉన్నారు**



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

సైఫాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త: ముంబై వలస జీవుల డిమాండ్లను అమలు చేస్తామని హామీ ఇచ్చే పార్టీకే తమ మద్దతు ఇస్తామని ముంబై తెలంగాణ బహుజన ఫోరం స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ముంబైకు వలస వెళ్ళిన జీవుల ఓట్లు ఇక్కడ 15 లక్షలకు పైగా ఉన్నాయని, తెలంగాణ ఉద్యమంలో తాము కీలక పాత్రను పోషించామని, తమ మాతృభూమి అయిన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వాములుగా ఉన్నామని ఫోరం తెలిపింది. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం ప్రతినిధులు సిరిపంగి రవీందర్, చుక్క అంజ య్య, కొమ్ము అంజయ్య, సి.హెచ్.గణేష్ ముదిరాజ్, మూలనివాసీ మాలజీ, గ్యార శేఖర్ తదితరులు మాట్లాడుతూ ముఖ్యంగా వలస జీవులకు రవాణా సౌకర్యం కల్పించడంలో అధికారంలోకి వచ్చే ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసి అమలు చేస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలస జీవులకు అంబులెన్స్ ఏర్పాటు చేయాలని, శ్రమ జీవులకు షెల్టర్‌తో కూడిన 'తెలంగాణ కార్మిక భవన్' బికెసి ప్రాంతంలో ఏర్పాటు చేయాలని, దీపావళి-వేసవి సెలవుల్లో ముంబై నుంచి తెలంగాణకు ప్రైవేటు బస్‌ల రాకపోకల్లో ధరలు తగ్గించాలని, లగ్జరీ బస్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ప్రత్యేకంగా నిధిని కేటాయించాలని వారు కోరారు. గతంలో తమ సమస్యలపై తెలంగాణ ప్రభుత్వానికి, అధికారులకు పలు మార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవాలేదని వాపోయారు. ఇప్పటికైనా వలస జీవుల సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

## సూరారం బస్టాప్ వద్ద బిజెపి స్ట్రీట్ కార్నర్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, నవంబర్ 18, ప్రభాతవార్త : సుభాష్‌నగర్ 130 డివిజన్, సూరారం బస్‌స్టాప్ వద్ద బిజెపి ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి కుత్బుల్లాపూర్ బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ హాజరై ఎన్నికల్లో కమలం పువ్వుకు ఓటు వేసి బిజెపిని గెలిపించాలని అభ్యర్తించారు. ఈ సమావేశానికి సూరారం కాలనీ సాయి బాబా నగర్ తదితర బస్తీల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై బిజెపి మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్దపు హామీలు, మాయ మాటలతో 9ఏండ్లు కుత్బుల్లాపూర్ ప్రజలను ఈ బిఆర్ఎస్ అభ్యర్థి మోసం చేసారన్నారు. మళ్ళీ బిఆర్ఎస్ అభ్యర్థికి ఓటేస్తే కుత్బుల్లాపూర్ ఆగం అవుద్ది. కాంగ్రెస్ అభ్యర్థికి ఎన్నికల సమయంలోనే ప్రజలకు గుర్తుకు వస్తారన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా నేను ప్రజలకు అందుబాటులో ఉన్నానని, సూరారం కాలనీ సర్వే నెంబర్ 107లో నెలకొన్న రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించి, పేదలందరికీ ఇండ్ల పట్టాలు ఇప్పిస్తానన్నారు. సూరారంని మంత్రి కెటిఆర్ దత్తత తీసుకుంటానని, దొంగ హామీలు ఇచ్చి, ఇప్పటికీ కన్నెత్తి చూడలేదన్నారు. బిఆర్ఎస్ కాంగ్రెస్ అభ్యర్థుల మాటలు నమ్మితే, మళ్ళీ ఐదేండ్లు ఆగం అవుతామన్నారు. ఈనెల 30న ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డా.ఎస్. మల్లారెడ్డి, సుభాష్ నగర్ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పాండు బస్తీలో బిజెపిలోకి చేరికలు..** సుభాస్‌నగర్ డివిజన్ పాండు బస్తీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు భూసిరెడ్డి వాణి, ఏవూరి వినోద సుమారు 300మందితో కలిసి శనివారం కుత్బుల్లాపూర్ బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఆయన బిజెపి కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. నిర్మల, సరితా, కౌసల్య, సంధ్య శివ, దేవేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, మారుఫ్, ఉస్మాన్, యశ్వంత్‌రెడ్డి, సాయి మరో 300మంది కార్యరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారులు వేధింపులు ఆపాలి

**తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్**



నూతన అధ్యక్షులు కందుకూరి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

హైదరాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త: క్లియర్‌గా ఉన్నఫైల్స్‌కు కూడా విద్యుత్ అధికారులు ఇబ్బందులు సృష్టిస్తూ విద్యుత్ మంజూరు కోసం ఇబ్బందులు పెడుతున్నారని తెలంగాణ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం తీవ్ర ఆక్షేపణ తెలిపింది. ఈమేరకు శనివారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కందుకూరి శ్రీనివాస్ ఆధ్యక్షతన జనరల్‌బాడీ సమావేశాన్ని సికింద్రాబాద్‌లోని ఓహోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టర్లు తమ సమస్యలను విన్నవిస్తూ కొన్ని సర్కిళ్లలో తమ బినామీలతో పనులు చేయించాలనే నేపథ్యంలో ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన బాధ్యులు భాస్కర్, సత్యనారాయణ, రాజు, నాగయ్య, సలావుద్దీన్, మహేందర్, పుల్లారావు, సలహాదారులు మహారాజ్, సిద్ధిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహాయ సహకారాలతో అభివృద్ధి చేశాం

**ఇంకా అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే వివేకానంద**



సమావేశంలో మాట్లాడుతున్న వివేకానంద

నిజాంపేట్, నవంబర్ 18, ప్రభాతవార్త : నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధి 9వ డివిజన్‌లోని భవ్యాస్ ఆనందంలో శనవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి వివేకానంద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిదిన్నరేళ్ల కాలంలో నిజాంపేట్ కార్పోరేషన్‌ను అందరి సహాయ సహకారాలతో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఈ అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు మరోమారు ముచ్చటగా బిఆర్ఎస్ పార్టీని గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. అదేవిధంగా 9వ డివిజన్ కార్పోరేటర్ రజితా రవికాంత్ ఆధ్వర్యంలో టిడిపి బిజెపి పార్టీలను చెందిన పలువరు నాయకులు, మహిళలు ఎమ్మెల్యే కెపి వివేకానంద సమక్షమంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఎ.శశికాంత్‌చౌదరి, ఫణీంద్రచౌదరి, కె.శ్రీనివాస్‌చౌదరి, ఎ.శివరాం, రాజేశ్వరిరెడ్డి, సీత, వైశాలి, శశికళ, ఝాన్సీ, వాణి, లక్ష్మీ ఛటర్జీ, ఉమాలత, బుచ్చిబాబు, శశికాంత , యూసఫ్, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, కెపిఆర్ అధ్యక్షులు శశి, దివ్యప్రభ, పీపీఆర్ హోమ్స్ రాజు, శ్రీమిత సొసైటీ, వెంకట్‌రెడ్డిలు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి, ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, 9వ డివిజన్ కార్పోరేటర్ రజిత రవికాంత్, కార్పోరేటర్లు, కో అప్షన్ సభ్యులు, ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో గులాబీ జెండా ఎగరాలి

**ఎమ్మెల్యే కెపి వివేకానంద**

జీడిమెట్ల, నవంబర్ 18, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద శనివారం జరిగిన చేరికల కార్యక్రమంలో 126 జగద్గిరిగుట్ట డివిజన్ బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ రషీద్ ఆధ్వర్యంలో రింగ్ బస్తీకి చెందని పలువురు యువకులు, మహిళలు ఎమ్మెల్యే కెపి వివేకానంద సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ళ కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధిని సీఎం కెసిఆర్ ఆశీస్సులు, మంత్రి కెటిఆర్ సహాయ సహకారాలతో ఎంతో అభివృద్ధి చేశామని రానున్న రోజుల్లో కూడా మరింత అభివృద్ధి చేపడుతామన్నారు. పార్టీలో నూతనంగా చేరినవారు మనం చేసిన అభివృద్ధిని, మానిఫెస్టో ద్వారా చేపట్టబోయే ప్రగతిని ప్రజలకు వివరించి నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో మూడవ నెంబర్‌పై ఓటు వేసి భారీ మెజార్టీ వచ్చే విధంగా పని చేయాలన్నారు. అనంతరం శోభరాణి, జితేందర్ పటేల్, సుష్మాదేవి, అంజలిసింగ్, రాజమణి, జయశ్రీ, చిరంజీవి, క్రిష్ణ, లక్ష్మణ్, హిమచరణ్, పూజామా, సాగర్ పటేల్‌లు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ వేణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్పుకోసం ఎల్‌జెడికి మద్దతివ్వండి

**లోక్‌తాంత్రిక్ జనతాదళ్ రాష్ట్ర అధ్యక్షులు రత్నం బూరగ**


సమావేశంలో మాట్లాడుతున్న రత్నం బూరగ, భక్తవత్సలం, అజయ్ తదితరులు

హైదరాబాద్, నవంబర్ 18,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలోని మార్పుకోసం మూడో కూటమిగా 86స్థానాల్లో పోటీ చేస్తున్న తాము 61స్థానాల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తెలంగాణ లోక్‌తాంత్రిక్ జనతాదళ్‌ను గెలిపించాలని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు రత్నంబూరగ కోరారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమూవేశంలో ఆయన మాట్లాడుతూ నూతన వ్యవస్థ కోసం, మూర్పుకోసం ఓటర్లను తిరిగి యజమాను లుగా చేయడటం కోంస, విద్య, ఉద్యోగాలు, వైద్య, ప్రభుత్వ సేవలు పరిపూర్ణంగా ప్రజలందరికీ అందటం కోసం ప్రజలు లోక్‌తాంత్రిక్ జనతాదళ్‌ను గెలిపించాలని ఆయన కోరారు. దేశంలో మూడవ కూటమిగా తెలంగాణ నుంచే ఆరంభం కానుందని, ముఖ్యమంత్రి ఒక ఎంఎల్ఏ ,ప్రధానమంత్రి ఒక ఎంపి అన్న విషయం మరువద్దన్నారు.

## శంకరమఠంలో అద్భుతంగా సాగిన భక్తి సంగీతం


భక్తి సంగీత కార్యక్రమంలో పాల్గొన్న ఎం.వి.రమణకుమారి, ఎం.వి.సుబ్బలక్ష్మి

చిక్కడపల్లి, నవంబరు 18 ప్రభాత వార్త: కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని నల్లకుంటలోని శృంగేరి శంకరమఠంలో శనివారం ప్రముఖ సాంస్కృతిక సంస్థ రాగరాగిణి ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి.రమణకుమారి, ఎంవి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. గాయనీమణులు ఎం.వి.రమణకుమారి, ఎం.వి.సుబ్బలక్ష్మి, శాంతికుమారి కనక, లలితావాణిలతో కలిసి అద్భుతంగా గానం చేశారు. ఎస్.బ్రహ్మానందం కీబోర్డుపై, ఆదిత్య మృదంగంపై వాద్యసహకారాన్ని అందించారు. ముందుగా 'శివశివ అన రాదా, దివ్య మంగళరూపిణి, శ్రీశైలం శివమయం, ఓంకార రూపిణి,కట్టెదుర వైకుంఠం, నీలకంధరాదేవా, ఒకపరి ఒకపరి వయ్యారమే, ఏమని పొగడుదుమే తదితర అద్భుతమైన భక్తి గీతాలను ఆలపించి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు.

## ప్రభుత్వ ఆస్తులను రక్షించిన ఘనత కాంగ్రెస్ పార్టీది: శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

**పార్కుల్లో మార్నింగ్ వాకర్లను కలిసి ప్రచారం నిర్వహించిన జగదీశ్వర్‌గౌడ్**

సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 18 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోని విలువైన ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వ సంస్థలను కాపాడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. అవినీతి లేని పాలన కోసం శేరిలింగంపల్లిలో హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఉదయం కొత్తగూడ బొటానికల్ గార్డెన్ వద్ద మార్నింగ్ వాకర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ జగదీశ్వర్‌గౌడ్ కుమార్తె హారిక శనివారం వివేకానందనగర్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ, చందానాయక్ తండాలో జగదీశ్వర్‌గౌడ్ సతీమణి, హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజితా జగదీశ్వర్‌గౌడ్ ఇంటింటి ప్రచారం చేపట్టారు.


బొటానికల్ గార్డెన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న శేరిలింగంపల్లి అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్

ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ తన పనితీరును మెచ్చిన శేరిలింగంపల్లి ప్రజలు మూడు పర్యాయాలు కార్పొరేటర్‌గా పనిచేసే అవకాశం తనకు కల్పించారని, కార్పొరేటర్‌గా తాను అవినీతిరహిత పాలన అందించానని అన్నారు. శేరిలింగంపల్లి సర్వతోముఖాభివృద్ధి కోసం రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కుల, మత, ప్రాంత, వర్గ భేదాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని గత ప్రభుత్వాలు తెలంగాణతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు బాటలు వేసిన విషయాన్ని ప్రజలకు గుర్తు చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన డయల్ 100 ఎన్నో వేల మంది ప్రాణాలను కాపాడిందని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకట్‌రావు, కపిల్‌రాజ్, ఏకాంత్‌గౌడ్, యాదగిరి, కల్పనగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం కల్పించిన ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**దక్షిణభారత న్యాయవాదుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్**



చిక్కడపల్లి, నవంబరు 18 ప్రభాతవార్త: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకుని సరైన వ్యక్తులను ఎన్నుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని దక్షిణభారత న్యాయవాదుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ పిలుపునిచ్చారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో ఓటు-రాజ్యాంగంపై చర్చా కార్యక్రమానికి సుధానాగేందర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు షాబుద్దీన్, డాక్టర్ ఇస్మాయిల్, తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, న్యాయవాదులు ప్రవల్లిక, ఎం.రాజ్‌కుమార్, సతీష్‌గౌడ్, రామచంద్రారెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. భారత పార్లమెంట్ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునే విధంగా సరైనరీతిలో ప్రజలు అప్రమత్తమై రాజకీయ పార్టీలు చేసే తప్పుడు వాగ్దానాలకు లోబడకుండా ఉచిత హామీలు, ఉచిత పథకాలకు ఆశపడకుండా గ్యారెంటీలతో ప్రజలకు వివిధ పార్టీల ప్రకటనలు ఇస్తున్నారో వాటిని అమలుకు నోచుకునే విధంగా ఉన్నాయో లేదో ఆలోచించుకోవాలని పేర్కొన్నారు. రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం, ప్రజల హక్కును రక్షించేదే రాజ్యాంగం ఎన్నుకోబడ్డ ప్రభుత్వమైన రాజ్యాంగానికిలోబడి రాజ్యాంగంపై ప్రమాణంచేసి రాజ్యాంగబద్దంగా నడుచుకోవాల్సి ఉంటుంది. దీనిపై ఎవరికి ఎలాంటి సందేహం ఉండదని, ప్రజలు ఈ విషయం తెలియక రాజకీయ నాయకులు చెప్పే అసత్య ప్రచారాలకు నమ్మి రాజ్యాంగం కల్పించిన ఈ ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేయడం వల్ల ఐదు సంవత్సరాలు వారి చేతిలో అనేకమైన మోసాలకు, అనేక కష్టాలకు గురవుతున్నారన్నారు.

## జన రాజ్యం పార్టీ మ్యానిఫెస్టో విడుదల

సైఫాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త: ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, అగ్రకుల నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందేలా తమ పార్టీ ఎంతో కృషి చేస్తుందని జన రాజ్యం పార్టీ ప్రకటించింది. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల మ్యానిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జె.ఎల్.ఆశీర్వాదం, మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి డా. పొకూరి లక్ష్మణాచారి, ముషీరాబాద్ అభ్యర్థి ఉట్కూరి సాయి లక్ష్మీనారాయణగౌడ్, నాయకుడు డానియేల్‌టోనీ తదితరులు మాట్లాడుతూ పిల్లలకు ఉచితంగా విద్యను అందించేందుకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి, అంతర్జాతీయ స్థాయి స్టాండర్డ్ సదుపాయాలు, విదేశీ విద్యకు కృషి చేస్తామని, నిరుద్యోగులు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం కోసం స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రాంలు, అవగాహన సదస్సులు, సాఫ్ట్‌వేర్ కంపెనీల బ్రాంచీల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

### కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో భస్మాసుర హస్తం

సైఫాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టో అభయ హస్తం కాదని భస్మాసుర హస్తమని బిఆర్ఎస్ పార్టీ నాయకుడు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు ఆరోపించారు. ఆది మ్యానిప్లేటెడ్ పేపర్స్ అని, తలతోక లేకుండా ఉందని, సిఎం కెసిఆర్‌ను అప్రతిష్టపాలు చేసేందుకేనని ఆయన నిశితంగా విమర్శించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మ్యానిఫెస్టో ఆశాస్త్రీయంగా ఉందని, ఏలాంటి అవగాహన లేకుండా రూపొందించడం జరిగిందని, ఆదాయానికి మించిన హామీలను ప్రకటించారని, ఎక్కడ నుంచి నిధులు తీసుకువస్తారని ప్రశ్నించారు. కర్ణాటక రాష్ట్రంలో అమలు కాని పథకాలు తెలంగాణ రాష్ట్రంలో ఏలా అమలు జరుగుతాయని, రాష్ట్రంలో 40 లక్షల మంది నిరుద్యోగులు ఉంటే 2 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తే మిగిలిన వారి పరిస్థితి ఏమిటన్నారు.

### రోడ్ షోకు వెళ్లిన నాయకులు, కార్యకర్తలు



తార్నాక, నవంబర్ 18 ప్రభాతవార్త: లాలాపేట్ వినోభానగర్ నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ యూత్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేష్ వైష్ణవ్,స్థానిక నాయకురాలు బంగారి చంద్రకళ ఆద్వర్యంలో సికింద్రాబాద్‌లో నిర్వహించిన మంత్రి కేటీఆర్ రోడ్ షోకు భారి ఎత్తున తరలివెళ్లారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్,ఆయన కుమారుడు త్రినేత్ర గౌడ్ ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.

## కన్నులపండువగా శ్రీసంగమేశ్వరస్వామి కార్తీక మహోత్సవాలు


పరమశివునికి విభూత్యాభిషేకం

నాంపల్లి, నవంబరు 18 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలోని అతిప్రాచీన శ్రీసంగమేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామివార్ల దేవాలయం, ఎస్‌బిహెచ్ కాలనీ వద్ద, గాంధీనగర్‌లో కార్తీకమాస మహోత్సవాలు 14న ఆకాశ దీపారాధనతో ప్రారంభమై కన్నులపండువగా జరుగుతున్నాయి. వచ్చేనెల 12వ తేదీవరకు నెలరోజులపాటు జరగనున్న ఈ కార్తీకమాస మహోత్సవాల్లో భాగంగా అశేష భక్తజన సందోహ శివనామసర్మణ మధ్య ఉదయం 9గంటలకు విభూత్యాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. వేదమంత్రోచ్ఛారణ, ప్రత్యేక పూజలతో పండితులు, అర్చకస్వాములు పరమశివుడికి విభూతి అభిషేకం ఇత్యాది పూజాకార్యక్రమాలు శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించి భక్తులు శివధ్యానంలో మునిగితేలి ముగ్ధులనుచేసి ఆధ్యాత్మికలోకంలో విహరింపజేశారు. ఈ కార్తీక మహోత్సవాల్లో 20న ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, 7.30నుండి సాయంత్రం వరకు ఏకవార రుద్రాభిషేకములు; 23న ఉదయం 9.30లకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతములు, 24న ఉదయం 9లకు శతచ్ఛిద్ర రుద్రాభిషేకం, రాత్రి 7లకు తులసి కళ్యాణం; 25న శనీశ్వరునికి తైలాభిషేకములు; 26న రాత్రి 7లకు జ్వాలాతోరణం, పుష్పాలంకరణ; 27 ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం; 7.30నుండి ఏకవార రుద్రభిషేకములు; 30న ఉదయం 9లకు రుద్రహోమం; డిసెంబరు 3న ఉదయం 9లకు అన్నాభిషేకం, మధ్యాహ్నం 12లకు వనభోజనములు; 4న ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం; 7.30నుండి ఏకవార రుద్రభిషేకములు; 9న సాయంత్రం 5లకు లక్షబిల్వార్చన; 11న ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం; 7.30నుండి ఏకవార రుద్రభిషేకములు; 12న ఉదయం 9లకు సప్తవింశతి కలశాభిషేకము తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఆలయ కమిటీ, ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

## ఎంపి ఎమ్మెల్యే కాలనీలలో విజయారెడ్డి స్నేహపూర్వక సమావేశం


స్నేహపూర్వక సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న వియజారెడ్డి

ఫిల్మ్‌నగర్, నవంబర్ 18, ప్రభాతవార్త : ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ రోడ్ నెంబర్ 10లోని ఎమ్మెల్యే, ఎంపీ కానలీ పార్క్‌లో జరిగిన స్నేహపూర్వక సమావేశ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.వియజారెడ్డి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు అందరూ తనని ఆశీర్వదించి, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని విజయా రెడ్డి విజ్ఞప్తి చేశారు. కాలనీలో ఉన్నటువంటి సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని, కాలనీవాసులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజవకర్గంలోని మాజీ కార్పోరేటర్లు పలు డివిజన్ల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**పంజాగుట్టలో ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి ఇంటింటి ప్రచారం**

ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వర నగర్ డివిజన్ ప్రతాప్ నగర్ అప్పర్ బస్తీ, లోయర్ బస్తీ, పంజాగుట్టలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ప్రజలకు వివరిస్తూ కార్యక్రమాన్ని ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.విజయారెడ్డి నిర్వహించారు. గత రెండు పర్యాయాలు బిఆర్ఎస్ పార్టీ పేద ప్రజలకు ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చిందో తెలియజేయాలని, పెన్షన్ల కోసం వచ్చిన అప్లికేషన్లు ఎన్ని, వాటిలో ప్రజలకు మంజూరు చేసినవి ఎన్నో తెలియజేయాలని డిమాండ్ చేశారు.

## ముస్లింలను బీజేపీ, కాంగ్రెస్‌లు వంచించాయి

**హోంమంత్రి మహమూద్ అలీ**


హోంమంత్రి ఆశీర్వాదం తీసుకుంటున్న లాస్య నందిత

కంటోన్మెంట్, నవంబర్ 18 ప్రభాతవార్త : కాంగ్రెస్, బీజేపీలు ముస్లింలను వంచించాయని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ మండిపడ్డారు. మైనారిటీలకు అన్ని విధాల అండగా నిలిచింది బీఆర్ఎస్ అని స్పష్టం చేశారు. కంటోన్మెంట్ బోయిన్‌పల్లిలోని తెలంగాణ గార్డెన్స్ లో నిర్వహించిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముస్లింలంతా సీఎం కేసీఆర్ వెంటే ఉండాలని సూచించారు. సీఎం కేసీఆర్ పాలనలో గంగా జమునా తహజీబ్ విలసిల్లుతోందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలకు ముస్లింల గోడు పట్టదని ఎద్దేవ చేశారు. మోదీ పాలనలో ముస్లింలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కాని తెలంగాణలో సీఎం కేసీఆర్ మాత్రం భారీ బడ్జెట్‌ను కేటాయించారని అన్నారు. ఈ కార్యాక్రమంలో ఎంఎన్ శ్రీనివాస్, గజ్జెల నాగేష్, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, అనిత, నళిని, మసీఉల్లాఖాన్, హరి, టీఎన్ శ్రీనివాస్, నర్సిహ్మా ఇతర నేతలు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

**ముషీరాబాద్ ఆర్ఓ లక్ష్మీనారాయణ**

ముషీరాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త: ఎన్నికలలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఎన్నికల సిబ్బంది అందరూ జాగ్రత్తలు పాటించాలని ముషీరాబాద్ ఆర్ఓ లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం దోమలగూడ ఏవీ కళాశాలలో పీఓలకు, ఏపీఓలకు ఎన్నికల నిర్వహణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఎన్నికల ట్రెనింగ్ తీసుకుని ప్రతి ఒక్కరూ పుస్తకంలో ఉన్న నిబంధనల ప్రకారం సమర్ధవంతంగా ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. ఎన్నికల పరిశీలకులు సత్యేంద్ర ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలింగ్ బూతులలో కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాలని, సాయంత్రం 5 గంటల లోపు పోలింగ్ స్టేషన్ లోపలకు వచ్చిన ఓటర్లకు అనుమతి కల్పించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో 5 గంటల తరువాత వచ్చే ఓటర్లను అనుమతించరాదని సూచించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో పరిశీలకులు తిప్పర్తి


అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఓ లక్ష్మీనారాయణ

యాదయ్య, బూత్‌స్థాయి అధికారుల నుండి ఏఎల్ఓలు, బీఎల్ఓలు, అసిస్టెంట్ బూత్ అధికారులు పాల్గొన్నారు.

**20,24,29 తేదీలలో ఎన్నికల ఖర్చుల తనిఖీ:** ఈనెల 20, 24, 29 తేదీలలో ఎన్నికలలో పోటీచేస్తున్న అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆర్ఓ లక్ష్మీ నారాయణ తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల సందర్భంగా చేస్తున్న ఖర్చుల వివరాలను పోలింగ్ తేదీ కంటే ముందుగా మూడు పర్యాయాలు తనిఖీ చేయించుకోవాలని సూచించారు.

## పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు

నాచారం, నవంబర్ 18 ప్రభాతవార్త: ప్రముఖ ఫర్నిచర్ బ్రాండ్ అయిన రాయలో ఓక్ ఫర్నిచర్ స్టోర్స్‌ను నాచారం ప్రదాన రోడ్డులో శనివారం లాంఛనంగా ప్రారంభించారు. రాయలోక్ ఫర్నిచర్ చైర్మన్ విజయ్ సుబ్రమణ్యం, మేనేజింగ్ డైరెక్టర్ మథన్ సుబ్రమణ్యం, ఇరినా మోసెస్...హెడ్ హూవమ్ డెకర్, నరేష్ స్టేట్ హెడ్‌త,,, ఏపి.తెలంగాణ హెడ్ తిలక్.. విజువల్ హెడ్ మర్చండైజింగ్ అండ్ ప్రశాంత్ కోటియన్.. హెడ్.. సేల్స్ అండ్ మర్చండైజింగ్ సమక్షంలో ఈ షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయల్ ఓక్ ఫర్నిచర్ చైర్మన్ విజయ సుబ్రమణ్యం మాట్లాడుతూ తమ సంస్థ ద్వారం ఎంతో మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగ అవకాశాలను కల్పించడంతో పాటు నాన్యమైన ఫర్నిచర్‌ను అందించాలనే నిబ్బద్దతతో పనిచేస్తున్నామని వెల్లడించారు. ఈ స్టోర్స్ అమెరికా, ఇటలీ, టర్కీ, మలేషియా, బారతదేశం నుంచి అత్యుత్తమమైన అంత్యంత ప్రత్యేకమైన ఫర్నిచర్‌ను అందిస్తున్నామని చెప్పారు.


**వార్త VAARTHA CLASSIFIEDS**

**FOR SALE**

★ SELL/RENT YOUR PROPERTY Online-No Brokerage @ www.truehomes24.com for Rs10/day. Call:8825553678. (Ro.No.36116)

**RECRUITMENT**

★ WANTED SHOP HELPER for Readymade shop in Hyderabad, Salary upto Rs.12000/- pm Call: 9059288288, 8977288288. (Ro.No.36212)

**PLOT FOR SALE**

★ DIWALI DHAMAKA OFFER: Mumbai Highway Facing, DTCP & RERA Approved, Residential Villa Plots @ Sadashivpet, Clear title, Resale Assurance, Agents welcome Ph: 9381305267. (Ro.No.876)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


## విద్యార్థుల భవితవ్యం వారి అంకితభావంపైనే ఆధారపడి ఉంటుంది

**తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరెపల్లి నంద**


ప్రసంగిస్తున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరెపల్లి నంద, చిత్రంలో డాక్టర్ అరవిందా, కృష్ణమూర్తి

హైదరాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త: విద్యార్థుల భవితవ్యం వారి అంకితభావం పైనే ఆధారపడి ఉంటుందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరెపల్లి నంద పేర్కొన్నారు. శనివారం చిక్కడపల్లి లోని పెండేకంటి న్యాయ కళాశాల ఆధ్వ ర్యంలో రెండు రోజుల పాటు 'కార్పొరేట్-వాణిజ్య చట్టాలు-ధోరణులు సాంకేతికతల గతిశీలత' అంశంపై జాతీయ సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్యఅతిథిగా జస్టిస్ నంద హాజరై ప్రసంగించారు. విద్యార్థులు వారి కష్టార్జితం చాలా అవసరమన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, కార్పొరేట్ గవర్నెన్స్, మర్జర్స్, ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాలు తదితర వాటి గురించి వివరించారు. కంపెనీలు వాటి సభ్యుల బాధ్యతలు, హక్కుల గురించి విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయవిభాగాధిపతి, డీన్ ప్రొఫెసర్ డాక్టర్ బి.విజయలక్ష్మి మాట్లాడుతూ నూతన కంపెనీల చట్టం విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో వాసవీ విద్యాసంస్థల కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, సభ్యులు , వివిధ రంగాల నిపుణులు, కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు


ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న చైర్మన్ మల్కా కొమురయ్య

తార్నాక, నవంబర్ 18 ప్రభాతవార్త: పల్లవి మోడల్ స్కూల్ 8వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జునన్...ఈ యాత్ర ఎక్స్ పిడిషన్ టువర్డ్స్ ఎండ్యూటెయిన్మెంట్ అండ్ సమర్పన్ పేరుతో వైవిధ్య భరితమైన కార్యక్రమాన్ని స్కూల్ ప్రిన్సిపల్ సునీర్ నాగి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కిశోరి ధాత్రక్, అనురాధా రెడ్డి, కల్పనా రమేష్ పాల్గొని వివిద పోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్, పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ మల్కాకొమురయ్య, సీఓఓ మల్కా యశస్వి, డైరెక్టర్ డా.సుధ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిద సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీర్‌నాగి, వైస్ ప్రిన్సిపల్ విద్యారావుతో పాటు విద్యార్థుల తల్లి,తల్లితండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE II ADDL. SENIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIR1 DISTRICT, AT MALKAJGIRI**
**O.S No. 2083 OF 2022**

Between:
**Sri. Gorigey Pentaiah** ...Petitioner/Plaintiff
And
**Smt. Tripura Sumalatha & others** ...Respondents/Defendants

To
**1. Smt. Tripura Sumalatha** W/o. Sri. T. Srinivasa Rao, Aged about 40 years, Occ: Housewife, R/o. H.No.17-127/1/21, Annapurna Nagar Colony, Uppal Village and Mandal, Old Ranga Reddy District, **Presently,** Medchal - Malkajgiri District.
**2. Smt. Pulagam Hymavathi** W/o. Sri. P. Chandra Sekhara Nehru, Aged about 65 years, Occ: Housewife, R/o. H.No.17-127/1/21, Annapurna Nagar Colony, Uppal Village and Mandal, Old Ranga Reddy District, **Presently,** Medchal - Malkajgiri District

**NOTICE**

The Plaintiffs have filed the above suit for Perpectual Injuction in respect of open plot bearing No.29/part in sy.No's 89, 90, 97 admeasuring 150 sq.yds and open plot bearing No.28 & 29/part in Sy.Nos. 89, 90 & 97 admeasuring 250 sq.yards situated at "Ramakrishna Nagar", Peerzadiguda Village, presently Peerzadiguda Municipal Corporation, Ghatkesar Mandal, Ranga Reddy District presently, Medipally Mandal, Medchal-Malkajgiri District and declare the sale deeds bearing document No.3171/2007 dated 06-03-2007 and 3170/2007 dated 06-03-2007 as null and void and not binding on the plaintiff against the defendants and the said suit is posted to **07-12-2023 at 10.30 a.m.** for your appearance personally or through an Advocate in the above said court, failing which, the matter will be decided on merits.

**Sd/- KOTHA JANARDHAN REDDY**
**ADVOCATE**

**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT SECUNDERABAD**
**O.S NO. 634 OF 2023**

BETWEEN:-
**Mrs. A. SREEVANI and others** ...Plaintiffs
AND
**The Tahsildar and another** ...Defendants

Please take notice, the above named plaintiffs filed a SUIT FOR LEGAL HEIRS OF THE DECEASED DODLA RAJESH VIJAYA VARDHANA to be effected by the defendants. If anyone having any objection/ Claim for grant of above relief may appear on **29-11-2023 at 10:30 am** before the said court, falling which the matter will be disposed off in accordance with law.
(BY ORDER OF THE COURT)

**D. Vishal Anand**
**Tharun Raj**
**Advocates**
2-2-147/A, First Floor, Above UCO Bank, M.G. Road, Secunderabad
**Cell: 9246102037**

**IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT, (UPPAL) AT L.B. NAGAR**
**O.S.No. 712 OF 2023**

Between:
**P. Bosu Babu and another** ...Plaintiffs
AND
**1. The Tahsildar,** Ghatkesar Mandal, Medchal Malkajgiri District
**2. All Concerned ...Defendants**
To,
**All Concerned** ...Defendant No.2

**NOTICE**

That the plaintiffs have filed the above said suit for Declaration of plaintiffs as Legal Heirs of deceased P. Mallika Devi died on 30.10.2017 and the said matter is posted on **30.11.2023.** If any person/s are having any claim or objection, then they may appear before the above said Hon'ble Court on the said date at 10.30 a.m. either in person or through the counsel, failing which the matter will be decided in your absence as per law.
//By Order of the Hon'ble Court//

**Sd/- K. GAL REDDY**
**Y. CHANDRA REDDY**
**Advocates**
Cell: 7013846315

**IN THE COURT OF THE II ADDL. SENIOR JUDGE : MEDCHAL-MALKAJGIRI DIST. AT : SAINIKPURI**
**O.S.No. 1353 OF 2022**
**(OLD O.S.No. 1950 OF 2018)**

Between:
**Rachakond Ramgopal Rao** ...Petitioners/Plaintiff
And
**M.Ramesh Reddy and another** ...Respondents/Defendants
To
**P. NARENDER S/o P. ASHAIAH**
Aged about 40 years,
Occ: Business, R/o H.No.1062,
Opp: Sai Marbles Nagole,
L.B. Nagar, Ranga Reddy Dist.
**...(Defendant No.2)**

**NOTICE**

Please take notice that the above named Plaintiff filed the above suit for Declaration the plaintiff a owner of suit schedule property i.e., Plot No.108, admeasuring 267 Sq.yards in Sy.No.92, Bodduppal (V), Ghatkesar (M), R.R.Dist then now M.M.Dist. The above named Respondent/Defendant No.2 are avoiding to receive the summons and notices of this Hon'ble Court. The Hon'ble Court ordered notices to you by way Publication and the same is posted to **01.12.2023 at 10.30 A.M.** for your appearance, such persons shall present or represented by any Advocate on the said date and otherwise the matter will be decided on merits.
//BY Order of the Hon'ble Court //

**Sd/- P. PRAVIN KUMAR**
**Advocate**
Flat No.201, Yelamanchali Residency, Road No.2, New Maruthinagar, Kothapet, Hyderabad-35,
**Cell: 9848721264**
**Email: pravinkpadal@yahoo.com**

**PUBLIC NOTICE**

Notice is hereby given to the public at large that my client **Sri MamudalaKalpana W/o Late Mamudala Prasad Rao,** aged about 44 years. R/o H.No. 9-101/B/T-302 Third Floor of Siri Heights Apartment, Chennareddy Enclaves, located at Peerzadiguda Village & Municipality, Medipally Mandal, Medchal - Malkajgiri District, Telangana. While she was shifting her house articles from Bahilimpur village near Gouraram, Medak District to Peerzadiguda on the way she lost her hand cover which contains her original Reg. Sale deed Doc. No.3624/2018 dated 22-02-2018. Any person who may have found and in possession of the above document may return them to my client at the above address or to me at the given address below.

**G. LALITHA**
*(M.COM, L.L.B)*
**ADVOCATE**
Vanasthalipuram, Hyderabad-500070.
**Mobile No.9866485256.**

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client **SRI VARAGANTI YADAIAH S/o V KURMAIAH** had lost his Original Irrevocable SALE DEED, Dated 09.03.2002 bearing Document No.1459/2002 in respect of H.No. Plot No.23A, admeasuring 100.00 Sy.yds or 83.64 Sq.mts in Sy.Nos.533 to 537 & 546, situated at AMBIKA NAGAR, PEDDA AMBERPET Village, HAYATH NAGAR Mandal, the then Ranga Reddy District and schedule of property EAST: PLOT NO.23B, WEST: PLOT NO.22B, NORTH: 30FT WIDE ROAD, SOUTH: PLOT NO.38A. He was travelling Dilsuknagar to Pedda Amberpet when he was Lost Document by travelling Near L.B.NAGAR JUNCTION.
If any person or persons finds the said Original Irrevocable SALE DEED, Dated 09.03.2002 bearing Document No.1459/2002 the same may be handed over to the undersigned as a law abiding citizen. Furher, the above said original document shall not be abused or misused or otherwise utilized by unauthorized person. If any unauthorized person makes misuse of it, the same shall not bind my client.
Hence, this Public Notice.

**Sd/- E. MAHENDER REDDY**
**M. RAMAKRISHNA**
**Advocates**
R/o. H.No.Plot 28, Vardha Nagar Colony, Bagh Hayath Nagar, Ranga Reddy District,
**Ph: 9848984286**

# బిఆర్ఎస్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి : బిఎల్ఆర్



ఎన్నికల ప్రచారంలో డప్పు వాయిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి



బండారి లక్ష్మారెడ్డికి హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

**ఉప్పల్, నాచారం, నవంబరు 18 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే ఉప్పల్‌నియోజకవర్గంలో మరింత అభివృద్ధి సాధిస్తుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం చిలుకానగర్ డివిజన్ అంబేడ్కర్‌నగర్,ఇందిరానగర్, కల్యాణపురి, సీతారామకాలనీ, జహీర్ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, పలువురు పార్టీనేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సిఎం కెసిఆర్ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించారని, రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలంటే బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఉప్పల్ పిస్తా హౌస్ నుంచి పలు కాలనీల మీదుగా ర్యాలీ నిర్వహించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

**చిలుకానగర్‌లో బిఎల్ఆర్‌కు జన నీరాజనం...** చిలుకానగర్ డివిజన్‌లో బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి చేపట్టిన ప్రచారానికి ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. నియోజకవర్గం పరిధిలో ఎక్కడికి వెళ్లినా పలువురు పార్టీ నేతలు ఆయనకు నీరాజనం పలుకుతున్నారు. హంగు, అర్బాటాలతో బండారి లక్ష్మారెడ్డి ప్రజలను కలుస్తూ ముందుకు సాగుతున్నారు. శనివారం చిలుకానగర్‌లోని పలు ప్రాంతాల మీదుగా ఆయన ఇంటింటికి తిరుగుతూ బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

**ఇంటింటికి బీఆర్ఎస్ మేనిఫెస్టో వెళ్లాలి : కార్పొరేటర్ శాంతిశేఖర్...** నాచారం డివిజన్‌లోని ఇంటింటికి బీఆర్ఎస్ మానిఫెస్టోవెళ్లాలని కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్, బీఆర్ఎస్ నాయకులు శాయిజన్ శేఖర్ బూత్ కమిటీ ఇంచార్జిలకు దిశానిర్ధేశం చేశారు. నాచారంలో బూత్ కమిటీ ఇంచార్జిలు, క్లస్టర్లతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బిఎల్ఆర్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. అన్ని డివిజన్లలోకెల్ల నాచారం డివిజన్‌నుంచి భారి మెజార్టీ వచ్చేలా చూడాలని, మహిళా నాయకురాళ్లు గడపగడపకు వెళ్లి బొట్టు పెట్టి ఓటును అభ్యర్థించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ ఇంచార్జిలు, క్లస్టర్ ఇంచార్జిలు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకే అధికారం.. : కెఎల్ఆర్



ప్రచారానికి ముందు పూజలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కెఎల్ఆర్



మీర్‌పేట్ కార్పొరేషన్ రోడ్ షోలో ప్రసంగిస్తున్న కెఎల్ఆర్

**సరూర్‌నగర్, నవంబర్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఈ సారి జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటు కాబోతున్నది.. మహేశ్వరం నియోజకవర్గం నుండి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతానని నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా శనివారం ఆయన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ గాయత్రీనగర్ రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులతో కలిసి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తప్ప మరే పార్టీకి ఓటు వేసినా అది మురిగిపోతుందని అన్నారు. మహేశ్వరంనియోజకవర్గంలో పేదలకు ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లే ఉన్నాయి తప్ప బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఇచ్చింది ఏమీ లేదని ఆయన విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గాన్ని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆయన స్పష్టం చేశారు. తనను దీవించి ఈ ఎన్నికల్లో గెలిపించాలని కెఎల్ఆర్ కోరారు.

**డిసిసి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ...**

కాంగ్రెస్ అభ్యర్థి కెఎల్ఆర్‌కు మద్దతుగా రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. అభ్యర్థి కెఎల్ఆర్ హాజరైన ఈ ర్యాలీ కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ సమీపంలోని మంద మల్లమ్మ చౌరస్తా నుండి జిల్లెలగూడ, మీర్‌పేట్ ప్రధాన రహదారుల గుండా సాగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పోరెడ్డి పద్మా భాస్కర్‌రెడ్డి, చల్లా కవితా బాల్‌రెడ్డి, సిద్దాల మౌనిక శ్రీశైలం, గజ్జెల రాంచందర్, పార్టీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సుధీర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న సాగర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సుధీర్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న తదితరులు

**ఎల్‌బినగర్, వనస్థలిపురం, సైదాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధిసాధ్యమని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని ఎల్బీనగర్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దేవీరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కొత్తపేట డివిజన్ రాజీవగాంధీ నగర్‌కాలనీ, బస్తీల్లో స్థానిక నాయకులతో కలిసి ఇంటిఇంటికి పాదయాత్ర చేస్తూ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ తన ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీలకు పూర్తి రక్షణ కల్పించడంతోపాటు ఇచ్చిన హామీలను నెరవేర్చామని అభివృద్ధిని చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెప్పుకోవడానికి ఏమి లేవని, ప్రతిపక్షాలను నమ్మి మోసపోవొద్దని అన్నారు. కాంగ్రెస్ కి ఓటు వేస్తే అభివృద్ధి ఆగిపోతుందని, గుంపులుగా వచ్చే ఇతర పార్టీల నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని, అభివృద్ధి, సంక్షేమం ఇలాగే కొనసాగలంటే కారు గుర్తుకు ఓటు వేసి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలకు ఇంకా ఏమి అభివృద్ధి పనులు చేయాలో ముందే పక్క ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గం మీద పట్టు లేని నాయకుల మాటలు నమ్మవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు లింగాల రాహుల్‌గౌడ్, మహేష్ రెడ్డి, విజయగౌడ్, ఉదయ్‌గౌడ్, ఇటికలయాదగిరి, జోగు నగేష్, దీప్‌లాల్, మల్లెపాక యాదగిరి, బాలాజీ,యాసిన్, బట్టు అంజయ్య, గాలయ్య, రాజేష్, సాయిలు, రామకృష్ణ, పాల్గొన్నారు.

**బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో...** బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్‌లోని శ్రీ కన్వెన్షన్‌లో వైదేహినగర్ నార్త్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం, విజయపురి కాలనీ సంక్షేమ సంఘం భవనంలో విజయపురి ఫేస్2 కాలనీ సంక్షేమసంఘం సభ్యులు కాలనీవాసులతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం, చైతన్యనగర్ కాలనీ లో నిర్వహించిన రోడ్డు షో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి. నగర్ బిఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గత 5 సంవత్సరాల్లో తాను చేసిన అభివృద్ధి సంక్షే మ పథకాలు మళ్ళీ నన్ను గెలుపిస్తాయన్నారు. అలాగే రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కో రారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న, డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్‌చౌదరి, సామ బుచ్చిరెడ్డి, సుమన్ గౌడ్, పోగుల రాంబాబు, జగన్‌మోహన్, రాఘవేంద్రరావు, అరుణ్, నాయకులు, పలు కాలనీల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

**కారు గుర్తుదే విజయం: రామ్మోహన్‌గౌడ్...** ఎల్‌బినగర్‌లో కారు గుర్తుదే విజయమని బిఆర్ఎస్ ఇంఛార్జి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ అన్నారు. కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానం చైర్మన్ నల్ల రఘుమారెడ్డితో కలిసి చంపాపేట డివిజన్‌లోని బైరామల్‌గూడ ఓల్డ్ విలేజి, సాయినగర్, ప్రగతినగర్, సీతారాం నగర్, ఎస్‌వికాలనీ, లక్ష్మిగణేష్‌నగర్, దుర్గానగర్, మాధవనగర్, డిఫెన్స్ కాలనీలలో ఇంటింటిటి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముడుపు రాజిరెడ్డి, రవి ముదిరాజ్, వింజమూరి రాఘవాచారి, సుంకోజు కృష్ణమాచారి, మెట్టు వెంకట్‌రెడ్డి, రోజారెడ్డి, అంజిరెడ్డి, చీర తిరుమలేష్, సురేందర్‌రెడ్డి, ఉమా మహేశ్వర్, వసంత, కవిత, విజయలక్ష్మి, రజని, రమ, నాగమణి, రాధిక, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం ప్రజలకు నాపై విశ్వాసం ఉంది.. : సబితారెడ్డి

**సరూర్‌నగర్, ఎల్‌బినగర్, నవంబర్ 18 ప్రభాతవార్త:** గడచిన ఐదేళ్లుగా మహేశ్వరం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా.. అన్ని ప్రాంతాల పురో గతికి, ప్రజా సంక్షేమానికి నిర్విరామంగా పని చేశా.. ఇంకా చేయాల్సింది ఉంది.. ఈ తరుణంలో వచ్చిన ఎన్నికల్లో నన్ను ఓడించడానికి ప్రత్యర్థులు డబ్బు సంచులతో తిరుగుతున్నారు.. అసత్య ఆరోపణలతో నాపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారు... ప్రజలు తస్మాత్ జాగ్రత్త.. ఓటు ద్వారా వారిని తరిమి కొట్టాలని నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. అదే విధంగా మీర్‌పేట్‌లో జరిగిన కాలనీ సంఘాల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రోడ్ షోలు, సమావేశాల్లో మాట్లాడుతూ పని చేసే వారినే మహేశ్వరం నియోజకవర్గం ప్రజలు గుర్తించి గెలిపిస్తారనే నమ్మకం తనకు ఉందని అన్నారు. ప్రజా సంక్షేమమే ఎజెండాగా ముందుకు పోతున్న తనను ఆదరిస్తారనే విశ్వాసం మెండుగా ఉందని ఆమె పేర్కొన్నారు. గత ఐదేళ్ళ కాలంలో సుమారు రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశాననీ రోడ్లు, డ్రైయిన్లు, ఎస్ఎన్‌డిపి పనుల కోసం సిఎం కెసిఆర్ ప్రత్యేకంగా నిధులు కేటాయించారని అన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.400లకే సిలిండర్, లావణి భూములకు పట్టాలు, పెంచిన పింఛన్లు ఇవ్వడం జరుగుతుందని ఆమె వివరించారు. అభివృద్ధి, సంక్షేమం ముందుకు సాగాలంటే బిఆర్ఎస్‌నే గెలిపించాలని ఆమె కోరారు.

**సబితారెడ్డికి మద్దతుగా చేరికలు..** సబితాఇంద్రారెడ్డికి మద్దతుగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 20వ డివిజన్ కాంగ్రెస్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ విజయలక్ష్మి శ్రీధర్‌తోపాటు గ్యారాలపాటి యాదయ్య తదితరులు డివిజన్ బిఆర్ఎస్ ఇంఛార్జి వంటేరు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సబితారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె వారికి గులాబి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మేయర్ ముడావత్ దుర్గదీప్‌లాల్‌చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, అర్కల భూపాల్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, అర్కల కామేష్‌రెడ్డి, సిహెచ్ జ్ఞానేశ్వర్‌చారి, బండి మీనా నాగేశ్ యాదవ్, సుర్వి లత శేఖర్‌గౌడ్, లంకాల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విశ్వ నగరంలో ఉపాధి అవకాశాలు : సబితారెడ్డి...** ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో విశ్వ నగరంగా రూపొందిన హైదరాబాదులో లక్షలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్ డివిజన్ సౌత్ డాక్టర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో యువ నాయకులు కార్తీక్‌రెడ్డితో కలిసి మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. గతంలో ఎల్బీనగర్ ప్రాంతం ఎట్లుండేనో నేడు ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లతో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. ఈ నెల30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని, ప్రజలకు మరోసారి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు.



సబితారెడ్డిని కండువాతో సన్మానించి గొర్రె పిల్లను అందజేస్తున్న కురుమ వృద్ధుడు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

# సామ రంగారెడ్డి గెలుపు తథ్యం : ఈటెల



ఈటెలను సన్మానిస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, ఎల్‌బినగర్, నవంబర్ 18 ప్రభాతవార్త :** రాష్ట్రంలో కుటుంబ పాలనకు స్వస్తి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని బిజెపి ద్వారానే సుపరిపాలన సాధ్యమవుతుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని సాహెబ్‌నగర్‌లో జరిగిన బిజెపి బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఉచిత వైద్యం, విద్యతోపాటు అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూంలు, రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుందని, కెసిఆర్ పాలనలో ప్రజలు విసిగిపోయారని అన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బిసిని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రధాని మోడి ప్రకటించారని, ఎస్సీల వర్గీకరణకు మార్గం సులభతరమవుతుందన్నారు. ఎల్‌బినగర్‌లో బిజెపి అభ్యర్థి సామ రంగారెడ్డిని గెలిపించాలని, తద్వార అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం ఇతరపార్టీలకు చెందినపలువురు బిజెపిలో చేరారు. అనంతరం ఈటెలను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎవిఎన్‌రెడ్డి, కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి,పవన్‌కుమార్, సామ ప్రభాకర్‌రెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్,కొత్త రవీందర్‌గౌడ్, తడకమళ్ల విజయ్‌కుమార్, శిరీష, నూతి శ్రీనివాసరావు, నాయిని శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, నవంబరు 18 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం కర్నాటక గాత్ర కచేరి, కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమతి బృందంచే సంగీత విభావరి ఎంతో ఆలరించింది. వయోలిన్‌పై మురళీధర్ మృదంగంపై రవికుమార్, సహకరించారు. నాట్య గురువు శ్రీ మధ్య పిచి కృష్ణ భారతి శిష్యులు వర్ష, అనన్య తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. శ్రీ విఘ్న రాజా భజేయ, భోశంభో ఎందరో మహానుభావులు, అలోకయే తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. శనివారం వారంతపు సెలవు కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన వచ్చిందని నిర్వాహకులు తెలిపారు.

# ఉప్పల్ ఐడిఎలో అక్రమ పార్కింగ్ దందా..!

## రూ.లక్షల్లో వ్యాపారం.. ప్రభుత్వ ఖజనాకు ఎగనామం



ఉప్పల్ మాడ్రన్ వద్ద పారిశ్రామికవాడలో అక్రమంగా పార్కింగ్ దందా దృశ్యం

**ఉప్పల్, నవంబరు 18 ప్రభాతవార్త :** ఉప్పల్ పారిశ్రామికవాడలో ప్రభుత్వ అనుమతిలేకుండా యధేచ్ఛగా అక్రమ పార్కింగ్ దందా నడుస్తోంది. ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం ఎగనామంపెడుతూ కొందరు వ్యాపారులు రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా నడుస్తున్న ఈ వ్యాపారం లో కొందరు బడా నేతలతోపాటు, ఐలా అధికారులు, పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ చౌరస్తాలో గత దశాబ్దాల క్రితంనుంచి పంజా బావివద్ద లారీల అడ్డా ఉండేది. అప్పట్లో రెవెన్యూఅధికారులు ఈ స్థలం ప్రభుత్వానికి చెందినది అని పేర్కొంటూ లారీ అడ్డాను అక్కడి నుంచి తొలగించారు. ప్రతిరోజు ఈ లారీ అడ్డాకు సుమారు 3వేల వరకు ఇసుక,ఇటుక,కంకర తదితర వాహనాలు వచ్చేవి. అయితే ఈ స్థలాన్ని అప్పటి రెవెన్యూ, పోలీస్ అధికారులు బలవంతంగా తొలగించడంతో వారు స్టేడియంవద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఈ స్థలం కూడా ప్రవేటు వ్యక్తులకు చెందినది కావడంతో ఈ స్థలంవద్ద కూడా పార్కింగ్ తొలగించారు. ఇదే క్రమంలో పారిశ్రామికవాడలో దివాళాతీసిన కంపెనీలకు చెందిన ఖాళీ స్థలాలు వృధాగా పడిఉన్నాయి. కంపెనీలు నడపకుండా ఖాళీగా స్థలాలు ఉంచుకుంటే నిబంధనల ప్రకారం ఐలాకు తిరిగిఅప్పగించాల్సి ఉంటుంది. అయితే స్థలాలు తీసుకున్న కంపెనీల నిర్వహకులు వీటిలో అక్రమంగా పార్కింగ్ కోసం తమ స్థలాలను దారదత్తం చేశారు. ఉప్పల్ పారిశ్రామికవాడలో సుమారు 5వేల వరకు లారీలు నిత్యం వస్తున్నాయి. ఒక్కో లారీ నుంచి ప్రతి నెలా రూ.3 నుంచి 5 వేల వరకు నిర్వహకులు వసూలు చేస్తున్నారు. వీరి వద్ద నుంచి ప్రభుత్వానికి నయా పైసా ఆదాయం లేకున్నా వీరి పట్ల చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఉప్పల్‌నుంచి రామంతాపూర్‌కు వెళ్లే రహదారి తోపాటు, జెర్సీ డైరీ ముందు ఉన్న ప్రభుత్వ స్థలంలో కూడా ఇదే విధమైన పార్కింగ్ దందా నడుస్తోంది. దీనిపై ఐలా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ వ్యాపారుల నుంచి దండుకుంటున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.

**ఐలా అధికారుల అండతోనేనా..? :** ఉప్పల్ పారిశ్రామికవాడలో ఐలా అధికారుల అండలోనే ప్రభుత్వం తక్కువ రేటుకు ప్రైవేటు కంపెనీలకు ఇచ్చిన స్థలాల్లో పార్కింగ్ దందా చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. లారీలు రోడ్డుపై నిలుపకుండా చర్యలు తీసుకుంటున్నామని చెబుతూ లారీ యజమానులనుంచి వేలల్లో డబ్బులు వసూలు చేస్తూ, ప్రభుత్వ స్థలంలో ఉచితంగా పార్కింగ్‌సదుపాయం కల్పించే అవకాశమున్నా ప్రైవేటు వ్యాపారులకు పార్కింగ్ వ్యాపారం అప్పగించారు. దీనిపై గతంలోనే పలు ఫిర్యాదులు ఉన్నప్పటికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

**అక్రమపార్కింగ్‌పై చర్యలు తీసుకుంటాం: ఐలా కమిషనర్...** ఉప్పల్ పారిశ్రామికవాడలో అక్రమ పార్కింగ్‌పై తగు చర్యలు తీసుకుంటామ ని ఐలా కమిషనర్ ఉమామహేశ్వర్ తెలిపారు. పారిశ్రామికవాడకు చెందిన కంపెనీలకు చెందిన స్థలాల్లో పార్కింగ్ చేసేందుకు వీలు లేదని, ఇటువంటి వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. జెర్సీ ఎదురుగా ఉన్న ఐడిప స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు రూ.40వేలకు అద్దెకిచ్చినట్లు తెలిపారు. లారీలు రోడ్డుపై పార్కింగ్ చేయకుండా ఉండేందుకు గతంలో ఇక్కడ పార్కింగ్ కల్పించారని, వీటిపై విచారణచేసి చర్యలు తీసుకుంటామన్నారు.

# ఆరు గ్యారెంటీలను వివరిస్తూ కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం



పెద్దఅంబర్‌పేటలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

**హయత్‌నగర్, నవంబరు 18 ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి విజయంకోసం పెద్దఅంబర్‌పేటలో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో, ఆరుగ్యారెంటీలను ప్రజలకు వివరిస్తూ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అవినీతి బీఆర్ఎస్ పాలనను గద్దె దించి ఇందిరమ్మ పాలన రావాలంటే హస్తం గుర్తుకు ఓటువేసి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. విద్య, వైద్యం, మహిళలు, రైతుల సంక్షేమంకోసం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను తీసుకు వచ్చిందన్నారు. ఇబ్రహీంపట్నంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆయన కుమారుడి భూ దందాలు, అక్రమ వసూళ్లకు చెక్‌పెట్టాలంటే మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ప్రచారంలో కౌన్సిలర్లు సిద్దంకి కృష్ణారెడ్డి, బొర్ర అనురాధసురేష్, పసుల రాజేందర్, పండుగుల జయశ్రీరాజు, సంజీవ, గంట లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# నాది సాదా సీదా సాధారణ జీవితం : కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్ తదితరులు

**వనస్థలిపురం, నవంబరు 18 ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్‌లో కుట్ల నరసింహాయాదవ్ ఆధ్వర్యంలో వివిధ కాలనీల సభ్యుల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కీగౌడ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాది సాదాసీదా సాధారణ జీవితమని, 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతి మరకలు లేకుండా నీతిగా నిజాయితీగా స్వచ్ఛమైన రాజకీయాలు చేస్తున్న.. ప్రజలు నాపై విశ్వాసం ఉంచి గెలిపిస్తారని నాకు పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. మీ ఎమ్మెల్యేగా 24 గంటలు అందుబాటులో ఉంటూ మీ సమస్యలే మేనిఫెస్టోగా పెట్టి నిరంతరం సమస్య సాధన దిశగా కృషి చేస్తానని మాటిచ్చారు. రామ్‌రెడ్డినగర్, క్రిస్టియన్‌కాలనీ, నాగార్జున కాలనీ, హస్తినాపురం ఈస్ట్ ఫేజ్ 1 2 3, అభ్యుదయనగర్ కాలనీ, జనప్రియ హోమ్ కాలనీల అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులను ఆయన కలిసి తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి ఆదివాసీ వైస్ చైర్మన్ బెల్లకాయ్ నాయక్, మహిళా అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, మన్సూద్ అలీ, ప్రకాష్ శ్రీను లడ్డు కవిత భాను రత్నకుమారి మల్లేష్ గౌడ్ సత్తయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేగా నాకూ అవకాశం ఇవ్వండి : బిజెపి అభ్యర్థి అందెల శ్రీరాములు



ప్రచారానికి వచ్చిన అందెలపై పూల వర్షం కురిపిస్తున్న దృశ్యం

**సరూర్‌నగర్, నవంబర్ 18 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో అభివృద్ధికి, ప్రజా సంక్షేమం కోసం పని చేయడానికి తనకు ఒకసారి అవకాశం ఇచ్చి చూడాలని నియోజకవర్గ బిజెపి అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం ఆయన మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జనప్రియానగర్, లెనిన్‌నగర్, బృందావన్ తదితరకాలనీల్లో పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి, గాజుల మధు, కోదూరు సోమేశ్వర్, పార్టీ శ్రేణులతో కలిసి ముమ్మర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వలేదనీ ఈ సారి అయిన తనను గెలిపించాలని ఆయన కోరారు. తనకు పట్టం కడితే మీర్‌పేట్ కార్పొరేషన్‌లో పెరిగిన ఇంటి పన్నులను తగ్గిస్తామని ఆయన హామీనిచ్చారు.

**అందెలకు మద్దతుగా శంకర్‌రెడ్డి ప్రచారం...** అందెల శ్రీరాములు యాదవ్‌కు మద్దతుగా రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి బాలాపూర్‌లో పార్టీ క్యాడర్‌తో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి, షాపు షాపుకు తిరిగి కరపత్రాలు పంచి బిజెపికి మద్దతు ఇవ్వాలని కోరారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల నుండి విముక్తి చేయడానికి అందెలను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

# నేరెడ్‌మెట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 56వ గ్రంథాలయ వార్షికోత్సవాలు



జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో కళాశాల ప్రిన్సిపల్ ఎం. శైలజ.

**నేరెడ్‌మెట్, నవంబర్ 18 ప్రభాతవార్త:** జాతీయ గ్రంథాలయ 56వ వార్షికోత్సవ వేడుకలను శనివారం నేరెడ్‌మెట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల కారణంగా విద్యార్థులకు, పాఠకులకు ఎంతో ముఖ్యమైన సందేశం అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రదర్శనలో ఎన్నో రచలకు సంబంధించిన పుస్తకాలను ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ బుక్కా బాలస్వామి పాల్గొని పలు పుస్తకాలను సందర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నాగేంద్ర, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, అహల్య, విద్యార్థులు పాల్గొన్నారు.